ప్రజాశక్తి

సోమవారం 24 జులై 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

సాహితీ ఫార్మా పేలుడులో..

ఫోరెన్సిక్ నివేదిక కోసం ఎదురుచూపు

◆ యాజమాన్య తప్పిదమని ప్రాథమిక నిర్ధారణ ? ◆ కొద్దిరోజుల్లో తుది నివేదిక

సాహితీ ఫార్మాలో ఎగిసిపడుతున్న మంటలు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని అచ్యుతాపురం సాహితీ ఫార్మాలో జరిగిన ప్రమాదంపై ఫోరెన్సిక్ నివేదిక కోసం విచారణ బృందం ఎదురుచూస్తోంది. ఇది రాగానే తుది నివేదిక తయారుచేయనున్నారు. ఆరుగురు కార్మికుల మృతికి కారణమైన సాహితీ ఫార్మా యాజమాన్యంపై త్వరలో పరిశ్రమల తనిఖీ అధికారులు కేసు నమోదుచేయనున్నారు. పరిశ్రమల తనిఖీ అధికారులు గతంలో గుర్తించిన లోపాలను సరిచేసుకొనివుంటే ఈ స్థాయిలో కంపెనీలో ప్రమాదం జరగడానికి అవకాశం తక్కువగా ఉండేది. అధికారుల నోటీసులపై యాజమాన్యం స్పందించకుండా యథాతథంగా కార్యకలాపాలు కొనసాగించింది. ఈ నిర్లక్ష్యమే ఆరుగురు కార్మికుల మరణాలకు దారితీసింది. ఉష్ణోగ్రతలను నియంత్రించే ఆటోమెటిక్, ప్రమాద నియంత్రణ వ్యవస్థలు సరిగా ఏర్పాటు చేయకపోవడంతో పాటు అర్హత, అనుభవంలేని వ్యక్తిని సేఫ్టీ సూపర్‌వైజర్‌గా నియమించినట్లు జాయింట్ కలెక్టర్ జాహ్నవి నేతృత్వంలో విచారణ బృందం నిర్వహించిన పరిశీలనలో తేలింది. ఈ పేలుడు సాహితీ ఫార్మా యాజమాన్యం తప్పిదాల వల్ల జరిగిన ప్రమాదమేనని నిర్ధారణకొచ్చినట్లు తెలిసింది. యాజమాన్యం కొన్ని భద్రతా ప్రమాణాలు పాటించివుంటే జూన్ 30న సాహితీ ఫార్మాలో సాల్వెంట్ శుద్ధి క్రమంలో భారీ మంటలు చెలరేగివుండేవి కావన్న విషయం విచారణ నివేదికలో పేర్కొన్నట్లు మిగతా 2లో..

మణిపూర్ ఘటన

మానవత్వానికి మాయని మచ్చ

హింసాకాండ, అకృత్యాలను ఖండిస్తూ విశాఖ రచయితలు, కవులు తీర్మానం

నూనెల శ్రీనివాసరావు కవితల సంపుటిని ఆవిష్కరిస్తున్న ఎంవిఎస్.శర్మ, కవులు, రచయితలు

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిని ముక్త కంఠంతో ఖండిస్తూ విశాఖ రచయితలు, కవులు తీర్మానం చేశారు. ప్రజాకవి నూనెల శ్రీనివాసరావు తృతీయ వర్ధంతి సందర్భంగా అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సాహితీవేత్తల సమావేశం జరిగింది. ఫ్రాన్సిస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మణిపూర్ ఘటనలపై తీర్మానాన్ని సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని బలపరుస్తూ స్టీల్‌ప్లాంట్ రచయితల తరపున మాటూరి శ్రీనివాసరావు, అమరావతి సాహితీ వేదిక అధ్యక్షులు అర్జునుడు, మిగతా 2లో..

ఘనంగా ముగిసిన ట్రైబల్ ఫెస్టివల్

ఆకట్టుకున్న గిరిజన నృత్యాలు - ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు

▶ వార్త 2లో..

శ్రద్ధాంజలి

జననం : 21-07-1956

మరణం: 06-07-2023

కీ॥శే॥ శ్రీ లాలం భాస్కరరావు గారు M.Sc., B.L.

Ex. M.P.P., Ex. Z.P.T.C. రాంబిల్లి మండలం,

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, యలమంచిలి నియోజకవర్గం

సార్! మీరు వేసిన ప్రతి అడుగు మాకు ఆదర్శం.. నడిచిన ప్రతిదారి సదాశయం చేరిన ప్రతి గమ్యం స్ఫూర్తి శిఖరం...మీరే మాకు మార్గదర్శి... మీ ప్రేమాను రాగాలతో మా అందరిని అభిమానించి, మీ ఆశయాలతో మమ్ములను ముందుకు నడిపిస్తూ విశ్రమించిన.. మీకు మా హృదయ నివాళులు.. మీ అడుగు జాడల్లో నడుస్తామని మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ శోక తప్త హృదయాలతో...

తెలుగుదేశం పార్టీ - రాంబిల్లి మండలం

శ్రద్ధాంజలి

జననం : 21-07-1956

మరణం: 06-07-2023

కీ॥శే॥ శ్రీ లాలం భాస్కరరావు గారు

Ex. M.P.P., Ex. Z.P.T.C. రాంబిల్లి మండలం,

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, యలమంచిలి నియోజకవర్గం

మీరు మాపై చూపిన ప్రేమ.. ఆప్యాయతలు.. మా మనస్సులో ఎప్పటికీ నిలిచే ఉంటాయి. కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించిన మీరు మమ్ములను వీడి దైవసన్నిధికి చేరినారు. మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...

భార్య : లాలం భవాని, మాజీ ఛైర్‌పర్సన్, జిల్లా పరిషత్ ఉమ్మడి విశాఖ జిల్లా

కుమారుడు - కోడలు: లాలం భరత్, సునయన

కుమార్తె - అల్లుడు: డా॥ సప్పా భార్గవినాయుడు, డా॥ నరేష్

సోదరుడు - మరదలు: లాలం సుధాకర్ నాయుడు రిటైర్డ్ తహశీల్దారు, లాలం సునంద
పిల్లలు : సిరిపురపు సుస్మిత - పరేష్, ఆదిరెడ్డి శ్రీ విష్ణు తేజ - శరత్ తేజ

సోదరుడు - మరదలు: లాలం సత్యప్రసాద్ మాజీ సర్పంచ్, లాలం శ్రీదేవి ఎం.పి.టి.సి.
పిల్లలు : లాలం శశికాంత్ - ధరణి చరిష్మ, జాగారపు భావన నాయుడు- చిరంజీవి ఆదిత్య

పిన్ని: శశికళ

సోదరి : రాజాన శ్రీదేవి గవర్నమెంట్ టీచర్, రాజాన భాస్కరరావు

పిల్లలు : కూండ్రపు హర్షిణి-సత్య, రాజాన హర్షవర్ధన్

పెద్దకర్మ : తేది: 24-07-2023 సోమవారం లాలం కోడూరు గ్రామంలో మా స్వగృహమునందు జరుగను.

మొదటి పేజీ తరువాయి..

ఫోరెన్సిక్ నివేదిక కోసం ఎదురుచూపు

సమాచారం. ఈ ప్రమాదంలో యాజమాన్య తప్పిదాలు కొట్టిచ్చినట్లు కనిపించడంతో ప్రమాదానికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. ఫార్మా, ఇతర ప్రమాదకరమైన పరిశ్రమల్లో ప్రమాదాలు తరచూ జరుగుతుండడంతో అజాగ్రత్తగా వున్న ఈ కంపెనీ యాజమాన్యంపై బలమైన కేసులు నమోదుచేయాలన్న ఆలోచనలో అధికారులున్నట్లు సమాచారం. ఫోరెన్సిక్ నివేదిక రాగానే తుది నివేదిక తయారుచేసి యాజమాన్యంపై విచారణ బృందం చర్యకు సిఫార్సు చేయనున్నట్లు తెలిసింది. పరిశ్రమల తనిఖీ అధికారులు కూడా శాఖాపరమైన చర్యలకు సమాయత్తమవుతున్నారు. సాహితీ ఫార్మా యాజమాన్యంపై నమోదుచేయబోయే కేసులతో బీమా సొమ్ము కూడా యాజమాన్యానికి వచ్చే పరిస్థితి లేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. సాహితీపై తీసుకొనే చర్యలతో భద్రతా ప్రమాణాలు, రక్షణ విషయంలో శ్రద్ధ వహించేలా ఇతర పరిశ్రమల యాజమానులకు సంకేతాలు ఇవ్వనున్నారు.

మణిపూర్ ఘటన మానవత్వానికి మాయని మచ్చ

అభ్యుదయ రచయితల సంఘం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, కథామంజరి తరపున జెపి.శర్మ, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ ప్రభృతులు ప్రసంగించారు. తీర్మానాన్ని కవులు, రచయితలు అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రమాదంలో పడిన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడంలో రచయితలు, కవులు ముందుండాలని పిలుపునిచ్చారు.

అత్యుత్తమ కవితల ఎంపిక

నూనెల శ్రీనివాసరావు వర్థంతి సందర్భంగా నిర్వహించిన స్మారక కవితా పోటీలకు 63 ఎంట్రీలు వచ్చాయి. వాటిలో అత్యుత్తమమైన తొలి మూడు కవితలుగా మామిడిశెట్టి శ్రీనివాసరావు కవిత 'ఆకుపచ్చని కల', చందులూరి నారాయణరావు కవిత 'చెట్టు కళేబరంపై డబ్బు లుకలుకలు', కటుకోఝ్వల రమేష్ కవిత 'కొట్టు దిమ్మిస' ఎంపికయ్యాయని న్యాయ నిర్ణేతలు ప్రకటించారు. విజేతలకు నూనెల శ్రీనివాసరావు సన్నిహిత మిత్రులు బాబూరావు, పైడిరాజు నగదు పురస్కారాలను అందజేశారు. బొడ్డ కూర్మారావు, జివిఎన్.చలపతి కవితా పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అలాగే నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 52వ వర్థంతి సందర్భంగా వక్తలందరూ జాషువా సాహిత్యపు విశిష్టతపై చర్చించారు. అనంతరం కవితా పఠనం జరిగింది. ఎవిఆర్కె.మూర్తి స్వాగతం పలుకగా వై.అప్పారావు వందన సమర్పణ చేశారు.

విద్యార్థులతో ఎల్ఐసి వర్కింగ్ ఉమెన్ కో ఆర్డినేషన్ కమిటీ ప్రతినిధులు

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి 22వ వార్డు పరిధి పిఠాపురం కాలనీ పార్కులో 50 మంది పేద విద్యార్థులకు ఎల్ఐసి వర్కింగ్ ఉమెన్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో నోట్ బుక్స్, పెన్ను, కంపాస్, పౌచ్, వారికి అవసరమైన ఇతర వస్తువులతో కూడిన కిట్లను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఫౌండర్ డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎల్ఐసి వర్కింగ్ ఉమెన్ కో-ఆర్డినేషన్ కమిటీ సహాయం చేస్తోందని తెలిపారు. ఓ వైపు ఉద్యమాలలో చురుగ్గా ఉంటున్న ఈ కమిటీ సేవల్లోనూ ముందంజలో ఉండటం అభినందనీయమన్నారు. కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ సూర్యప్రభ మాట్లాడుతూ చదువుకోవడానికి ఏదీ ఆటంకం కాకూడదన్న చిరు ప్రోత్సాహమే ఇదని తెలిపారు. ఐసిఇయు ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ మాట్లాడుతూ అందరూ బాగా చదువుకొని సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎం.కామేశ్వరి, తిరుమల, హరి జ్యోతి, పద్మావతి గోవింద్, శ్రీనివాసరావు, ప్రసన్న, శ్రీదేవి, లక్ష్మి, పద్మ, రాజేశ్వరి, విసిసి ఆర్గనైజర్ మణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గిరిజనుల హక్కులపై తీవ్ర దాడి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశంలో గిరిజనుల హక్కులపై తీవ్ర దాడి జరుగుతోందని ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.రాధాకృష్ణ అన్నారు. అటవీ హక్కుల చట్టం సవరణ బిల్లును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. విశాఖపట్నంలోని గిరిజన భవన్‌లో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు అంబిడి కోటేశ్వరరావు అధ్యక్షతన గిరిజనుల హక్కులపై ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన రాధాకృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన అటవీ చట్టం గనుక అమలైనట్టయితే గిరిజనులకు నిలువనీడ కరువవుతుందన్నారు. అటవీ పరిరక్షణ చట్టం 1980 అడవి, దాని వనరుల పరిరక్షణకు హామీనిచ్చే భారత పార్లమెంటు చట్టమని పేర్కొన్నారు. ప్రస్తుతం గిరిజనులకు రక్షణ కల్పిస్తున్న చట్టాలు, హక్కులపై తీవ్రమైన దాడి జరుగుతోందని తెలిపారు. సమావేశంలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోరాబు సత్యనారాయణ, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి రూడా సత్యారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.సాంబమూర్తి, స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు బొండా తౌడన్న, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు చిన్నం నాయుడు, జివిఆర్.మూర్తి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

మానసిక రోగులపై ప్రత్యేక దృష్టి - మందులు, నిధుల కొరత లేదు

'ప్రజాశక్తి'తో ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ రామిరెడ్డి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

మానసిక రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు శతవిధాలా కృషి చేస్తున్నామని ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ కెవి.రామిరెడ్డి అన్నారు. విశాఖలోని తమ ఆసుపత్రిలో మానసిక రోగులకు, వారి కుటుంబీకులకు కల్పిస్తున్న సౌకర్యాలు, చికిత్సలు, మందుల లభ్యత, భవిష్యత్తు ప్రణాళికలు తదితరాలను ఆయన 'ప్రజాశక్తి'కి వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రభుత్వ మానసిక వైద్యశాల ద్వారా ఎటువంటి వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు ?

ప్రభుత్వ మానసిక వైద్యశాలలో ప్రధానంగా మెంటల్ ఇల్లిసినేస్ వ్యాధులు స్కిజోఫినియా, బైపోలార్ డిజాడర్స్, ఆల్కహాల్ డిపెండెన్స్ సిండ్రోమ్, అప్సెసివే కంపేసివ్ డిజాడర్స్, న్యూరోటిక్ డిజాడర్స్, ఫోబియాస్, ప్యానిక్ డిజార్డర్స్ వంటి వ్యాధులకు చికిత్సలు అందిస్తున్నాం. వీటితోపాటుగా మెదడు ఎదుగుదల లేని పిల్లలు, చదువులో వెనుకబడిన పిల్లలు, సరిగా ప్రవర్తన లేని చిన్నారులకూ చికిత్సలు అందిస్తున్నాం.

ప్రస్తుతం ఆసుపత్రికి రోగుల తాకిడి ఎలా ఉంది ?

ఇది 300 బెడ్స్ కలిగిన హాస్పిటల్. ప్రస్తుతం ఇన్ పేషెంట్లుగా 238 మంది చికిత్స పొందుతున్నారు. అవుట్ పేషెంట్ విభాగంలో సగటున రోజుకు 500 మంది వరకూ హాస్పిటల్‌కు వస్తుంటారు. సోమవారం ఈ సంఖ్య 700 వరకూ ఉంటుంది. వీరిలో ఎక్కువగా పాత పాత రోగులు ఉంటారు. సగటున రోజుకు 30 మంది కొత్త రోగులు నమోదవుతారు.

సాధారణ రోగికీ, మానసిక రోగికీ మధ్య తేడా ఏంటి ?

మానసిక రోగులకు బేసిక్ క్లినికల్ టెస్ట్‌లంటూ ఏమీ ఉండవు. రోగితో మాట్లాడి వారి మానసిక స్థితిని డాక్టర్లు అంచనా వేస్తారు. అదేవిధంగా వారు ప్రవర్తించే లక్షణాలను బట్టి వారి ఆలోచన ఎలా ఉంది అన్న విషయాలను పరిశీలిస్తారు.

ఆసుపత్రిలో సౌకర్యాలు, మందులు, నిధుల లభ్యత ఎలా ఉంది?

ప్రభుత్వం అన్ని విధాలుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తోంది. ఎపిడిహెచ్ఎం ద్వారా ఎల్లవేళలా మందులు అందుబాటులో ఉంటున్నాయి. సగటున రోజుకు 500 మందికి మందులు ఇస్తున్నాం. గత నవంబర్ నుంచి కొన్ని మానసిక రుగ్మతలను ఆరోగ్య శ్రీలో చేర్చారు. నిధుల లభ్యత పుష్కలంగా ఉంది.

రానున్న రోజుల్లో చేపట్టబోయే అభివృద్ధి కార్య కలాపాలేంటి ?

రానున్న రోజుల్లో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రత్యేక డైట్‌ను ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఇప్పటికే కెజిహెచ్‌లో ఆరోగ్యశ్రీ రోగులకు అందరికీ ప్రత్యేక డైట్ ఇస్తున్నారు. అయితే ఆ విధంగానే ఇక్కడ ఇవ్వడం సాధ్యం కాదు. అన్ని చికిత్సలూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని కారణంగా కొంత జాప్యం జరుగుతోంది. త్వరలోనే దీనిని అధిగమించి అందరు రోగులకు ప్రత్యేక డైట్ అందించేందుకు ప్రయత్నిస్తాం. త్వరలోనే ప్రస్తుత భవనానికి పక్కనే ఉన్న సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ భవనంలో 80 పడకల ఆసుపత్రి ప్రారంభం కానుంది. అందులో 40 బెడ్స్ డిడిక్షన్ వార్డుకు, 20 బెడ్స్ చైల్డ్ వార్డుకు, 20 బెడ్స్ ముసలి వాళ్లకు ఏర్పాటు చేయనున్నాం. అనంతరం అదే తరహాలో మరిన్ని మానసిక రోగాలకు సంబంధించి ప్రత్యేక వార్డుల నిర్మాణానికి కృషి చేస్తాం. ఇప్పటికే నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఆఫ్ హెల్త్ కేర్ వర్కర్స్ అండ్ హెల్త్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్‌కు అర్హత సాధించాం. త్వరలోనే ఈ సర్టిఫికేషన్ కేంద్ర ప్రభుత్వం ద్వారా విశాఖపట్నం ప్రభుత్వ మానసిక వైద్యశాలకు లభిస్తుంది. ఆసుపత్రికి వచ్చే నిధులతో పాటు ఐదు శాతం అదనపు నిధులు ఆసుపత్రికి వస్తాయి. కేంద్రం ద్వారానూ నిధులు అందుతాయి.

ఆసుపత్రిలో రోగులకు, వారి కుటుంబీకులకు కల్పిస్తున్న సౌకర్యాలేంటి ?

రోగులకు, వారి కుటుంబీకులకు ఇక్కడ పూర్తి వసతులు కల్పిస్తున్నాం. ప్రతిరోగితో ఒక వ్యక్తి ఇక్కడ ఉండేందుకు అవకాశం ఉంది. వారికి భోజనం, కనీస వసతులు లభిస్తాయి. త్వరలోనే ఒక్కొక్క వార్డులో 8 చొప్పున కూలర్లు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. సిబ్బంది నుంచి రోగులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా సాంకేతికతను ఉపయోగించి హాస్పిటల్లోని అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. సిబ్బందితో మాట్లాడేందుకు వాకీటాకీలను సైతం ఇచ్చాం.

ఘనంగా ముగిసిన ట్రైబల్ ఫెస్టివల్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహకారంతో గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని విఎంఆర్‌డిఏ చిల్డ్రన్ ఎరీనాలో రెండు రోజులుపాటు నిర్వహించిన 'ట్రైబల్ ఫెస్టివల్' ఆదివారం సాయంత్రంతో ఘనంగా ముగిసింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ఎంతగానో ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు విశాఖపట్నం, పార్వతీపురం ప్రాంతాలను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. ఈ వేడుకలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి హాజరవుతారని అన్నారు.

నృత్యాలతో ఆకట్టుకున్న కళాకారులు

అలరించిన ప్రదర్శనలు

చివరి రోజు కార్యక్రమంలో భాగంగా గిరిజన నృత్యాలు ఐటిడిఎ కెఆర్.పురం నుంచి కొమ్ము కోయ నృత్యం (కోయ తెగ వారు), ఐటిడిఎ రంప చోడవరం నుంచి కొమ్ము కోయ నృత్యం (కోయ తెగ, కొండ రెడ్డి తెగ), ఐటిడిఎ చింతూరు నుంచి రేలా కొమ్ము కోయ నృత్యం (కోయ తెగ), ఐటిడిఎ పాడేరు నుంచి మయూర దింసా (కొందు తెగ), ఐటిడిఎ పార్వతీపురం నుంచి సవర నృత్యం (సవర తెగ), ఐటిడిఎ సీతంపేట నుంచి జాతపు జానపద నృత్యం (జాతపు తెగ) అద్భుతంగా ప్రదర్శించారు. ప్రదర్శనల అనంతరం ఉత్తమ నృత్య ప్రదర్శన అందించిన బృందాలకు రాజన్నదొర బహుమతులు అందజేశారు. పలు ఐటిడిఎలలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల విజేతలకు నగదు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గిరిజన క్రాఫ్ట్ వస్తువులు, వెదురు మైనంతో చేసిన ఆట బొమ్మలు, మామిడి పండ్లు, గిరిజన ఆహార ఉత్పత్తుల ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చివరి రోజు కార్యక్రమంలో టిసిఆర్ అండ్ టిఎం మిషన్ డైరెక్టర్ ఈశా రవీంద్ర బాబు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాలకొండ ఎమ్మెల్యే కె.కళావతి, ఎస్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎస్.లోవరాజు, టిసిఆర్ అండ్ టిఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చిన్నబాబు పాల్గొన్నారు.

రాజకీయ దురుద్దేశంతోనే ఆరోపణలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తల్లి హత్య కేసులో జైలుకు వెళ్లి బెయిల్‌పై విడుదలై వచ్చిన పొన్నాడ శివ అనే వ్యక్తి తనపై చేసిన ఆరోపణలన్నీ రాజకీయ దురుద్దేశంతో కూడినవేనని, ఆయన్ని ఎవరో పావుగా వాడుకుంటున్నారని మాజీ కార్పొరేటర్, రాష్ట్ర స్వర్ణకారుల సంఘం మాజీ అధ్యక్షులు గోడి నరసింహాచారి అన్నారు. ఆదివారం పాత నగరంలోని బ్రహ్మంగారి ఆలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆరోపణలు చేసిన శివ తన వద్ద పని చేయలేదన్నారు.

పాస్‌పోర్టు పోయినది

నా పేరు మొగిలిపురి వాసు, తండ్రి మొగిలిపురి సింహాచలం, వయస్సు 30సం॥ల (ఆధార్ నెం.524124242335) పాస్‌పోర్టు నెం.N1506682, CDC (Continuous Discharge Certificate) No.MUM 342325, నేను గాజువాక బస్టాండ్ నుండి జెరాక్స్ షాప్‌కు వెళ్తుండగా మార్గం మధ్యలో తేది.18-07-2023న నా ఫైల్ బ్యాగ్ పోయినది. ఈ బ్యాగ్‌లో పాస్‌పోర్టు, CDC కూడా ఉన్నాయి. కావున ఈ పాస్‌పోర్టు, CDC దొరికిన వారు ఈ అడ్రస్‌కు సంప్రదించగలరు.

మొగిలిపురి వాసు
తండ్రి మొగిలిపురి సింహాచలం
డోర్ నెం. 71-31-1382/2, కాకరలోవ,
గాంధిగ్రామ్ పోస్ట్, విశాఖపట్నం-530005
సెల్ : 9705875185, 9948337641

577 ఎకరాల్లో వరి నారు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక వ్యవసాయ డివిజన్ పరిధిలో ఉన్న భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో ఇప్పటి వరకు వరి 577.98 ఎకరాల్లో రైతులు నారు వేశారు. మండలాల వారీగా వరి సాధారణ విస్తీర్ణం పరిశీలించగా భీమిలిలో 1326 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 34.58 ఎకరాల్లో నారు వేశారు. ఆనందపురంలో 1563 ఎకరాలకు 49.40 ఎకరాల్లో నారు వేయగా, పద్మనాభంలో సాధారణ విస్తీర్ణం 6,229 ఎకరాలు కాగా 494 ఎకరాల్లో వరి నారు వేశారు. ఇప్పటి వరకు డివిజన్లో 63.7 శాతం నారు వేశారు.

వరి విత్త నాల పంపిణీ ఇలా...

డివిజన్లో 2,277 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం కాగా ఇప్పటి వరకు 2,142 క్వింటాళ్ల సరఫరా అవ్వగా, జులై 22వ తేదీ వరకు ఆర్బికెల ద్వారా రైతులకు 1306 క్వింటాళ్లు అందజేశారు.

వృద్ధులకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి -తగరపువలస : ఉపాధ్యాయులు, ఎంతోమంది దాతల సాయంతో సుమారు వంద రోజుల పాటు రోడ్డుపక్కన ఉన్న నిరాశ్రయులు, పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేసినట్లు టీచర్స్ హెల్ప్ వ్యవస్థాపకులు మరగడ రామకృష్ణ తెలిపారు. ఆదివారం స్థానికంగా ఉన్న పేదలకు ఆహార పొట్లాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ హెల్ప్ గౌరవాధ్యక్షులు కె.ముత్యాలరావు, పి.సన్యాసిరావు, ఉపాధ్యక్షులు శ్రీరమ్య, ఎం.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్, బ్రహ్మకుమారీ సంస్థల సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం దీనదయాల్పురంలోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ప్రవీణ్కమార్ సారధ్యంలో బాలురకు వైద్యులు దంత పరీక్షలు చేశారు. అవసరసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మణిభూషణ్, నీరజ, సిస్టర్ రామేశ్వరి, లలిత, కృష్ణవేణి, బాలుర గృహం పర్యవేక్షణాధికారి వీరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

బాల గంగాధర్ తిలక్ జయంతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానికంగా ఉన్న ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యాన బాల గంగాధర్ తిలక్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ లర్పించారు. ఈ సందర్భంగా ఆదర్శ ప్రేమీ మండలి గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు, అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు పాల్గొని బాల గంగాధర్తిలక్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం పరిచయ్, ప్రాథమిక, ప్రవేశిక పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

కాలువలు తవ్వేసి వదిలేశారు...

ప్రజాశక్తి - ఆరిలోవ : అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టిన కాలువల నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. సుమారు నెల రోజులు కావస్తున్నా పనులు పూర్తిచేయక పోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 12వ వార్డు పరిధి ఆరిలోవ, నెహ్రూనగర్లో నెల రోజుల క్రితం కాలువల నిర్మాణ పనులు చేపట్టారు. కాలువల మరమ్మత్తు పనులకు ఇంటి ముందు కాలువలు తవ్వేశారు. ఏమైందో కాని తవ్వేసిన కాలువలను సగం పనులు చేసి వదిలేశారు. కాలువల నిర్మాణ పనుల్లో భాగంగా ఇంటి మెట్లు కూడా తొలగించారు. ఇంట్లోకి రాకపోకలు సాగించాలంటే చెక్కలు వేసుకున్నారు. ఈ చెక్కలపై వెళ్లేందుకు చిన్నారులు, వృద్ధులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది వృద్ధులు, చిన్నారులు అదుపు తప్పి పడిపోతున్నారని స్థానికులు వాపోతున్నారు. కాలువల నిర్మాణ పనుల్లో భాగంగా డ్రెయినేజీ పైపులు పాడవడంతో మురుగు అంతా బయటు వచ్చేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీనిపై అధికారులకు, రాజకీయ నాయకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, స్థానిక కార్పొరేటర్ దీనిపై దృష్టి సారించి కాలువ పనులు పూర్తి చేయించాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

ఇబ్బందుల్లో స్థానికులు

తవ్వేసి వదిలేసిన కాలువ నిర్మాణ పనులు

టిడ్కో, ఎన్టిఆర్, హుదూద్ ఇళ్లను అప్పగించాలి

సుద్దగెడ్డ వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్ల సందర్శనలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి -మధురవాడ : టిడ్కో, ఎన్టిఆర్, హుదూద్ ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్కెఎస్వి.కుమార్ డిమాండ్చేశారు. సుద్దగెడ్డ వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్లను సిపిఎం మధురవాడ జోన్ కమిటీతో కలిసి ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్కెఎస్వి.కుమార్ మాట్లాడుతూ, ఆరేళ్ల క్రితం జివిఎంసి 7వ వార్డు పరిధి సుద్దగెడ్డ ప్రాంతంలో 60 కుటుంబాల రజకులను ఖాళీ చేయించి టిడ్కో ఇళ్ల నిర్మించారని, సంవత్సర కాలంలో వారికి ఇళ్ల నిర్మించి ఇస్తామని నమ్మించి నేటికీ ఇవ్వక పోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఇంకా ఎంత కాలం వారు కార్యాలయాల చుట్టూ తిరగాలని ప్రశ్నించారు. వీరితో పాటు ఇల్లు లేని పేదలు లబ్ధిదారులుగా ఎంపికై ప్రభుత్వానికి డీడీ రూపంలో డిపాజిట్ చేశారని, వారికి కూడా ఇళ్ల పూర్తి చేసి ఇవ్వలేదని తెలిపారు. ఇతర ప్రాంతాలలో టిడ్కో, ఎన్టిఆర్ హుదూద్ ఇళ్ల నిర్మాణం చేపట్టి సుమారు తొమ్మిదేళ్ల కావస్తున్నా నేటికీ పూర్తి చేయలేదన్నారు. పేదలకు ఇళ్ల కట్టిస్తున్నామని ప్రచారం తప్ప లబ్ధిదారులకు అప్పగించే విధంగా పనులపై శ్రద్ధ పెట్టడం లేదని విమర్శించారు. నిధులు మంజూరులో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ నాయకులు డి.అప్పలరాజు, పి.రాజుకుమార్, బి.భారతి, డి.కొండమ్మ, టికె.శారద పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు పరామర్శ

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి 5వ వార్డు పరిధి సాయిరామ్ కాలనీ సమీపంలో ఉన్న సీనియర్ తెలుగుదేశం కార్యకర్త తిరునగిరి రామారావు అనారోగ్యంతో ఇంటికే పరిమితం కావడంతో భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జి కోరాడ రాజబాబు, 5వ వార్డు కార్పొరేటర్ మొల్లిహేమలత ఆదివారం అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆత్మస్థైర్యాన్ని నింపారు. నిత్యవసర వస్తువులతోపాటు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, నమ్మి శ్రీను, నాగోతి వెంకట సత్యనారాయణ, ఈగల రవికుమార్, వియ్యపు నాయుడు, బొడ్డేపల్లి రంగ, లంక రాజేంద్రప్రసాద్, ఆవాల నీలయ్య, కరుమోజు గోవిందరావు, నారాయణరావు, వైకుంఠరావు, మొకర రవి, హరికృష్ణ, మోహన్, నాగరాజు, సుబ్బరాజు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు సాయం అందిస్తున్న రాజబాబు తదితరులు

పెద్దిపాలెంలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు

కరాటే పోటీలను ప్రారంభిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -ఆనందపురం: కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన ఆనందపురం మండలం పెద్దిపాలెం కింగ్స్ ఫంక్షన్ హాలులో మూడవ ఆంధ్రప్రదేశ్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలను భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ చాంపియన్ షిప్లో రాష్ట్రంలో 13 జిల్లాల నుండి 400 మంది బాల బాలికలు పాల్గొంటున్నారని, వీరందరినీ తీర్చి దిద్దిన మాస్టార్ల కృషి వెలకట్ట లేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు కోలా ప్రతాప్ కుమార్, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వాసుపల్లి శ్రీహరి, జనరల్ సెక్రటరీ జి.ఆనంద్బాబు, కోశాధికారి ఎమ్వి.రామమూర్తిరాజు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వివాహిత అదృశ్యం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన వివాహిత ధనాల గణపతి (24) ఈ నెల 20 నుండి కనిపించడం లేదని ఆమె తండ్రి బంగారి రమణ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... విజయనగరం జిల్లా, దత్తిరాజేరు మండలం, పెద్ద ఖాతా గ్రామానికి చెందిన ధనాల రాముతో గణపతికి 2020లో వివాహమైంది. ఐదు నెలల నుంచి గణపతి కన్నవారి ఇంటి వద్దనే ఉంటోంది. ఈ నెల 20న భర్త రాము మామిడి పండ్లు తీసుకొని ఆనందపురం మార్కెట్కు వచ్చారు. తర్వాత రాము వెంకటాపురంలోని అత్తవారింటికి వెళ్లాడు. డబ్బులు విషయంలో భార్యతో గొడవపడ్డాడు. తర్వాత రాము తిరిగి వాళ్ల ఇంటికి వెళ్లిపోయాడు. అదేరోజు టైలర్ వద్దకు వెళ్తానని గణపతి వాళ్ల అమ్మతో చెప్పి ఇంటి నుంచి నాలుగు గంటల సమయంలో వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు కంగారుపడి సమీపంలోనూ, బంధువుల ఇళ్లలోనూ, అత్తవారి ఇంటి వద్దా ఆరా తీశారు. ఎక్కడికీ రాలేదని తెలియడంతో ఆదివారం ఫిర్యాదు చేశారు. గణపతి ఐదు నెలలు గర్భిణి అని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి ఎస్ఐ పైడిరాజు దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలోని తీర ప్రాంతమైన బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు మైలపల్లి సోమేష్ చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మత్స్యకారుడు మైలపల్లి సోమేష్ ఆదివారం తెల్లవారు జామున తన సహచరులు నలుగురితో కలిసి చేపల వేటకు వెళ్లాడు. సముద్రంలో అల ఉధృతి పెరగడంతో బోటు ముందుభాగంలో తూలి పడి బోల్తా పడింది. బోటు ముందు ఉన్న కర్ర అతని చాతీకి బలంగా తగిలి ముందుకు పడిపోవడంతో గాయం అయ్యింది. గమనించిన సహచర మత్స్యకారులు సోమేష్ను ఒడ్డుకు చేర్చి కారులో హుటాహుటిన నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రక్తదానం చేస్తున్న దాతలు

జూ పార్కులో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ఆరిలోవ : లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్, రోటరీ క్లబ్ సంయుక్తంగా ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జూ సిబ్బంది, వాలంటీర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సుమారు 20 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి జూ క్యూరేటర్ డాక్టర్ నందిని సలారియా కృతజ్ఞతలు తెలిపారు. సర్టిఫికెట్లు, షీల్డులు బహూకరించారు. కార్యక్రమంలో జూ అధికారులు, లైఫ్ షేర్, రోటరీక్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి దినపత్రిక
ఉద్యోగ అవకాశాలు
విశాఖపట్నం కేంద్రంలో మార్కెటింగ్ విభాగాల్లో పని చేయుటకు ఉద్యోగాలు ఉన్నాయి
ఆసక్తిగలవారు మా కార్యాలయానికి వచ్చి సంప్రదించగలరు.
1. గాజువాక డివిజన్ కో-ఆర్డినేటర్ (మార్కెటింగ్)
2. జాబ్‌వర్క్ ఎగ్జిక్యూటివ్ (ప్రింటింగ్ వర్క్)
3. హెల్పర్స్ (ప్రింటింగ్ సెక్షన్)
- మొదటి ఉద్యోగానికి ఇతర పత్రికలలో మార్కెటింగ్‌లో అనుభవం ఉండాలి. టీంని లీడ్ చేసే సామర్థ్యం ఉండాలి
- 2వ ఉద్యోగానికి ప్రింటింగ్ వర్క్ ఆర్డర్లు బుక్ చేసే అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
- 3వ ఉద్యోగానికి 10వ తరగతి/ఐ.టి.ఐ లేదా ప్రింటింగ్ సెక్షన్‌లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు : 9490099125, 9490099133
ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం : ప్లాట్ నెం.3, 'జి' బ్లాక్, ఇండస్ట్రియల్ పార్క్, వడ్లపూడి, ఆటోనగర్, విశాఖపట్నం-46

టిడ్కో ఇళ్లకు మోక్షమెప్పుడో?

ప్రజాశక్తి-పెందుర్తి : టిడ్కో ఇళ్లకు మోక్షం ఎప్పుడు కలుగుతుందో, తమ బాధలు ఎప్పుడు తీరుతాయోనని పేదలు ఎదురుచూస్తున్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో పేదల సొంతింటి కల నెరవేరాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యాన జివిఎంసి 96వ వార్డు పరిధి రాజుచెరువు వద్ద సుమారు 800, 95వ వార్డు పరిధి చీమలాపల్లిలో సుమారు 500, పద్మనాభనగర్‌లో సుమారు 600 టిడ్కో ఇళ్లకు శంకుస్థాపనలు చేశారు. అప్పట్లో పేదల నుంచి టిడిపి ప్రభుత్వం డిడీల రూపంలో నగదు కట్టించుకుంది. ఇళ్ల నిర్మాణాలను చేపట్టింది. తర్వాత వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఇళ్ల గురించి సంవత్సరాల తరబడి పట్టించుకోలేదు. ఇటీవల కాలంలో రాజుచెరువు వద్ద ఉన్న టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. చీమలాపల్లి, పద్మనాభనగర్‌లో ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా మిగిలిన పనులు పూర్తికాలేదు. టిడిపి, జనసేన విమర్శలతో ముఖ్యమంత్రి జగన్మోహన్ ఆ ఇళ్లను వేగంగా పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలని ఆదేశాలు జారీచేసినా పనులు మాత్రం నత్తనడకనే సాగుతున్నాయి. తమ సొంత ఇంటి కల నెరవేరేదెన్నడో అని లబ్ధిదారులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి టిడ్కో ఇళ్లను అందించాలని లబ్ధిదారులు వేడుకుంటున్నారు.

ప్రభుత్వాలు మారితే పట్టించుకోరా?

ప్రభుత్వాలు మారితే తప్పు మాదా? పదేళ్ల నుంచి ఇంటి అద్దెలు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నాం. అప్పులు చేసి డిడీలు కట్టాం. టిడిపి ప్రభుత్వం మారి వైసిపి అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి టిడ్కో ఇళ్లను పట్టించుకోవడం మానేశారు. ఈ ప్రభుత్వ పాలనా కాలం చివరి ఏడాదిలో స్పందిస్తున్నారు. ఇప్పటికైనా త్వరితగతిన పనులు పూర్తిచేసి ఇళ్లను అప్పగించాలి.

ఉమ,
టిడ్కో ఇళ్ల లబ్ధిదారు

ఘనంగా చలసాని ప్రసాద్ వర్ధంతి

ప్రజాశక్తి-సీతమ్మధార : చలసాని ప్రసాద్ 8వ వర్ధంతిని పౌర గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పౌసిజం ముప్పపై నిర్వహించిన సదస్సులో అభ్యుదయ రచయితల సంఘం ప్రతినిధి ఆచార్య చందు సుబ్బారావు మాట్లాడారు. చలసాని ప్రసాద్ జీవితాంతం కమ్యూనిజం ఊపిరిగా బతికారని తెలిపారు. విప్లవ పోరాటాలకు ప్రజలను కార్యోన్ముఖులను చేసే సాహితీ సృజన కోసం, విరసం ఉద్భవించే చారిత్రక పరిణామంలో తన వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. సిపిఐ నాయకులు జెవి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ, విప్లవ యోధుల సరసన కలం యోధుడిగా చలసాని ప్రసాద్ నిలుస్తారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలం నుండి దండకారణ్య ఉద్యమం దాకా ఆయన సుదీర్ఘ ప్రయాణం సాగించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పత్రికా సంపాదకులు వేణుగోపాల్, విరసం ప్రతినిధి సిఎస్ఆర్ ప్రసాద్, మల్లేశ్వరి, పి.చంద్రశేఖర్, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రయివేటు ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి -గాజువాక : ప్రయివేట్ పాఠశాల ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు జిప్సా అధ్యక్షులు పాలవలస భాస్కరరావు తెలిపారు. గాజువాకలోని యశోద పబ్లిక్ స్కూల్లో ఆదివారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. మారిన పాఠ్యాంశాలపై యశోద విద్యానికేతన్‌లో ఈ నెల 29వ తేదీన నిష్ణాతులచే ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని కోరారు. నవంబర్ 14 బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సులను ఏర్పాటుచేయాలని సూచించారు. ఎమ్మెల్యే సహాయంతో వీలైనంత త్వరగా జిప్సాకు స్థల సేకరణ చేపట్టాల్సి ఉందన్నారు. సమావేశంలో విద్యార్థుల ఆన్‌లైన్ ప్రక్రియ, పాఠశాల గుర్తింపు రెన్యువల్, ఆర్‌టిఐ యాక్ట్ అడ్మిషన్లు, జిల్లా ఉమ్మడి పరీక్ష రుసుము తదితరాలపై చర్చించి పలు నిర్ణయాలు చేశారు. ఈ సమావేశంలో జిప్సా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, కోశాధికారి డి.శ్రీనివాస్, గౌరవాధ్యక్షులు ఆర్.శోభన్‌బాబు, సలహాదారులు ఎం.జగ్గారావు, జి.జగన్, ఎ.రాము, ఎం.సత్యనారాయణ, బాబూరావు, రమేష్ నాయుడు, కుమార్, కరస్పాండెంట్లు 80 మంది హాజరయ్యారు.

ఓటరుగా నమోదు చేయించుకోవాలి

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. విశాఖ తూర్పు నియోజకవర్గంలోని విశాలాక్షినగర్ పోలింగ్ బూత్ 82, 83 పరిధిలో ఆదివారం కలెక్టర్ ఇంటింటికి వెళ్లి ఓటర్ల సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరు కార్డులో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్లను నమోదు ఏవిధంగా చేస్తున్నది బూత్ లెవెల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవెల్ అధికారులతో పాటు బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

గాజువాక : ఓటర్ల నమోదు జాబితా ప్రక్రియను బిఎల్‌ఒలు సక్రమంగా నిర్వహించాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చెప్పారు. హెచ్‌బి.కాలనీలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. నమోదు, మార్పులు, చేర్పులులో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో కులుకురి మంగరాజు, ప్రమీల, నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పంచ గ్రామాల ఆవేదనను అర్థం చేసుకోవాలి

ప్రజాశక్తి-సింహాచలం: పంచ గ్రామాల ప్రజల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి పాసర్ల ప్రసాద్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి సత్యవాడ శంకరరావు కోరారు. స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో విశాఖ తహశీల్దార్ ఇచ్చిన పట్టాలను ప్రస్తావిస్తూ సింహాద్రి అప్పన్న కొండతో పాటు రైతుల భూములకు సంబంధించి రెండు రకాలైన ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. కొండ ప్రాంతమంతా సింహాద్రి అప్పన్నకు దక్కేలా అప్పటి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని వివరించారు. భూమి విలువకు భూమిని ఇవ్వాలని చెబుతున్న వారంతా ఒక్కసారి గతాన్ని గుర్తు చేసుకోవాలని సూచించారు. పంచ గ్రామాల్లో గృహ నిర్మాణదారులకు హక్కు కల్పించాలని కోరారు. 1903 గిన్నెస్ సర్వే నాటికే భూముల్లో రైతులు ఉన్నారన్న వాస్తవాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. జిరాయితీ భూముల్లో రైతుల హక్కులను పరిగణలోకి తీసుకోకుండా బానిసలుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం కొత్త టోల్‌గేట్ వద్ద జిరాయితీ భూముల్లో అధికారులు చేస్తున్న పనిని తప్పుపట్టారు. అభివృద్ధి పేరుతో పచ్చని తోటలను నాశనం చేయడం తగదన్నారు. భూముల వ్యవహారం కోర్టుల్లో ఉన్న నేపథ్యంలో రైతుల భూముల్లోకి ఎలా వెళ్తారని ప్రశ్నించారు. సింహాచలం బిఆర్‌టిఎస్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

కోవిడ్‌తో కొత్త పాఠాలు : ఆర్‌పి.పట్నాయక్

ప్రజాశక్తి-సీతమ్మధార : కోవిడ్ ఇటు సినిమా చూసేవారికి, అటు తీసే వారికి కొత్త పాఠాలు నేర్పిందని ప్రముఖ సంగీత దర్శకులు ఆర్‌పి.పట్నాయక్ పేర్కొన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యాన ఆదివారం పౌరగ్రంథాలయంలో 'కోవిడ్ తరువాత ప్రపంచ సినిమా- ప్రస్తుత స్థితి' అంశంపై ముఖా ముఖి నిర్వహించారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షులు ఆచార్య ఎన్ఎడి పాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్‌పి.పట్నాయక్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఇళల లోనే కూర్చొని తమకు ఇష్టమైన సినిమాను చూసుకొనే అవకాశం, చూసే చిత్రాన్ని ఎంచుకునే అవకాశం కలిగిందని తెలిపారు. ముఖ్యంగా సినిమా హాలుకు వెళ్ళే సంఖ్య తగ్గిందన్నారు. ప్రపంచ సినిమాను చూసే అవకాశం కూడా కలిగిందని వివరించారు. ప్రేక్షకులు సినిమాలు చూసే విధానం కూడా మారిందని.. ఏది నచ్చుతుందో అవగాహనతో సినిమాలు చూడటం అలవాటయిందని తెలిపారు. ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు జవాబులు చెప్పారు. ప్రధాన అతిథి ఆచార్య బాలమోహన్‌దాస్ పట్నాయక్ ను సత్కరించారు. ఫిల్మ్ సొసైటీ సభ్యులు పిఎన్.మూర్తి పెన్సిల్‌తో గీచిన స్కెచ్‌ను బహూకరించారు. వైజాగ్ ఫిలిం సొసైటీ నగర కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, పట్నాయక్ చేతిలో రూపొందిన పలు చిత్రాలతో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాశీ విశ్వేశ్వర రావు, బి.చిన్నారావు, డాక్టర్ బాబ్జీ, అనురాధ, శివన్నారాయణ, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

6వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి- పిఎం.పాలెం : జివిఎంసి 6వ వార్డు పరిధి పిఎం.పాలెం మాలతాంబ స్కూల్ ప్రాంతంలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో రాజకీయాలకు, పార్టీలకతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిదేనన్నారు. అన్ని వర్గాలకు అండగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, వైసిపి నాయకులు సత్యనారాయణ, ఎఐ శ్రీహరి, 5, 6, 7 వార్డుల వైసిపి అధ్యక్షులు పోతిన హనుమంతరావు, బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాస్, నాయకులు పోతిన యల్లాజీ, పోతిన ప్రసాద్, గాదె రోశి రెడ్డి పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధి కల్యాణి ఆసుపత్రి సమీపంలో మృతి చెందిన అనాథకు పివిఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, 60వ వార్డు కార్పొరేటర్ పివి సురేష్ సొంత ఖర్చుతో అంత్యక్రియలు నిర్వహించారు. ఓ వ్యక్తి మృతిచెందాడన్న సమాచారం తెలుసుకున్న సురేష్ అక్కడకు చేరుకున్నారు. ట్రస్టు సభ్యుల సహకారంతో మల్కాపురం ఎస్ఐ దేవుడమ్మ సమక్షంలో అనాథ మృతదేహాన్ని కోరమండల్ శ్మశానవాటికకు తరలించి ఖననం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, మల్కాపురం పోలీసులు పాల్గొన్నారు.

గంగవరం కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాటం

ప్రజాశక్తి -గాజువాక : అదాని గంగవరం పోర్టు కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు స్పష్టంచేశారు. అదాని గంగవరం పోర్టు యాజమాన్యం మొండి వైఖరికి నిరసనగా నిర్వాసిత కార్మికులు చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలు ఆదివారం నాటికి 20వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరాన్ని జగ్గునాయుడు ఆదివారం సందర్శించి మాట్లాడారు. పోర్టు నిర్మాణానికి భూములు, సముద్రాన్ని త్యాగం చేసిన నిర్వాసితులకు తగిన వేతనాలు చెల్లించమంటే అదానీ యాజమాన్యానికి ఎందుకు చేతులు రావడంలేదని ప్రశ్నించారు. షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ పేరుతో అతి తక్కువ వేతనాలు చెల్లిస్తూ కార్మికుల శ్రమను దోచుకోవడం యాజమాన్యం మానుకోవాలన్నారు. అదాని గంగవరం పోర్టు గత సంవత్సరం రూ.2000 కోట్ల మేర టర్నోవర్ చేసిందని, రూ.700 కోట్ల నికర లాభాలు వచ్చాయని తెలిపారు. ఇది ఏ రకంగా షాప్ అవుతుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక శాఖ కల్పించుకొని జిపిఎస్ పేరుతో ఉన్న షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ రిజిస్ట్రేషన్‌ను రద్దుచేయాలని కోరారు. గంగవరం పోర్టు కార్మికులకు న్యాయం జరిగే వరకూ అఖిలపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు అండగా నిలుస్తాయన్నారు. యాజమాన్యం మొండి పట్టు వదిలి సంప్రదింపుల ద్వారా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఈ ఆందోళన మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు. కార్మికులు ఏ పిలుపునిచ్చినా సిపిఎం ప్రత్యక్షంగా పాల్గొంటుందని ప్రకటించారు.

కార్మికులకు కాంగ్రెస్ మద్దతు : గిడుగు

ఎపి పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు కాంగ్రెస్ పార్టీ బృందంతో కలిసి శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ఎపి కాంగ్రెస్ కమిటీ సంపూర్ణమైన మద్దతు ఉంటుందని తెలిపారు. కేంద్రంలోని బిజెపికి తల్గొగ్గి రాష్ట్ర ప్రభుత్వ వాటాను అదానీకి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కట్టబెట్టారని విమర్శించారు. 30 సంవత్సరాలు తర్వాత పోర్టు ప్రభుత్వ పరం అవుతుందని అప్పటి ప్రభుత్వం చెప్పిందని, దాన్ని విస్మరించి నేటి ముఖ్యమంత్రి అదానీకి అప్పగించడం సరికాదన్నారు. ఆగస్టు నెలలో రాహుల్‌గాంధీ విశాఖపట్నం వస్తున్నారని, ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ, యాజమాన్యంతో సంప్రదింపులు జరుపుతున్నప్పటికీ జీతభత్యాలపై స్పష్టత రావడం లేదన్నారు. యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తూ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు నిరాకరిస్తుందని తెలిపారు. సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు నిరసన శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి కొవిరి అప్పలరాజు, వాసుపిల్లి ఎల్లాజీ, గంటిపల్లి అమ్మోరు, మాద అప్పారావు, పేర్ల సూరరాజు, గంటిపిల్లి లక్ష్మయ్య, కదిరి సత్యానందం, నొల్లి స్వామి, కొవిరి అమ్మోరు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు కాంగ్రెస్ మద్దతు : గిడుగు రుద్రరాజు

దీక్షా శిబిరంలో కూర్చుని మద్దతు తెలుపుతున్న జగ్గునాయుడు, గిడుగు రుద్రరాజు

25న అఖిలపక్ష రైతు సంఘాల జిల్లా సదస్సు

జయప్రదానికి ఎపి రైతు సంఘం నేతల పిలుపు

మాట్లాడుతున్న రైతు సంఘం నేత బాలకృష్ణ

ప్రజాశక్తి- మునగపాక రూరల్: ఈనెల 25న మునగపాకలో జరిగే అఖిలపక్ష రైతు సంఘాల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు ఎ.బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రాథమిక సహకార సంఘం భవనం ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ రైతు వ్యతిరేక సాగు చట్టాలకు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో 13 నెలలపాటు రైతన్నలు చేసిన పోరాటానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వ దిగొచ్చి వాటిని రద్దు చేసిందన్నారు. అదే సందర్భంలో అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పనకు చట్టం చేస్తానని హామీ ఇచ్చినా, నేటికీ నెరవేర్చకపోవడం బాధాకర మన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను భుజానికెత్తుకుని మోస్తున్న రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వ చర్యలను తప్పు పట్టారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడుతూ రైతు కుటుంబాలు ఇంటిల్లిపాది శ్రమించిన పెట్టుబడికి గిట్టుబాటు ధర లేకపోవడానికి కారణం నరేంద్ర మోడీ విధానాలే కారణమన్నారు. కేరళ ప్రభుత్వం తరహాలో ధాన్యం క్వింటాలుకు రూ 2,800లు గిట్టుబాటు ధర అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రైతాంగ సమస్యల పరిష్కారానికి 25న మునగపాకలో నిర్వహించే రైతు సదస్సుకు జిల్లావ్యాప్తంగా రైతులందరూ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు టెక్కలి జగ్గ అప్పారావు, గ్రామ రైతు సంఘం నాయకులు ఆడారి వెంకట సూరిఅప్పారావు, ఆడారి అప్పలనాయుడు, భీశెట్టి నాయుడు, అప్పారావు, సిఐటియు జిల్లా నాయకులు ఎస్ బ్రహ్మాజీ పాల్గొన్నారు.

బ్రాండిక్స్ వైద్య శిబిరంలో 412 మందికి కంటి పరీక్షలు

- 12 మంది స్వచ్ఛందంగా రక్తదానం

కంటి పరీక్షలను పర్యవేక్షిస్తున్న బ్రాండిక్స్ పార్టనర్ దొరైస్వామి

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ సామాజిక ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఆదివారం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 412 మందికి కంటిపరీక్షలు చేశారు. బ్రాండిక్స్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమంలో 12 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు.కంటి వైద్య శిబిరంలో 264మందికి ఉచిత కంటి అద్దాలను, 144మందికి మందులు అందజేశారు. 34మందిని అంతర కుసుమాలున్నట్లు గుర్తించి ఆపరేషన్ చేయించుకోవాలని వైద్యులు సూచించారు. శిబిరానికి వచ్చిన రోగులు సహాయకులకు మజ్జిగ, ఫలహారాలు, భోజనం సదుపాయం కల్పించారు.

ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా పార్ట్‌నర్ దొరస్వామి మాట్లాడుతూ, బ్రాండిక్స్ ఇండియా సామాజిక ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఉచిత వైద్యం,రక్తదాన శిబిరాలను నిర్వహించి, స్థానిక ప్రజల ఆరోగ్య సంరక్షణకు అండగా నిలవాలన్నదే లక్ష్యమన్నారు. రెడ్‌క్రాస్ విశాఖపట్నం డిస్ట్రిక్ట్ బ్రాంచ్ చైర్మన్ శివనాగేంద్ర రెడ్డి పాల్గొన్నారు

నీట్ విజేతకు అభినందన



ఉదయకుమార్‌ను అభినందిస్తున్న ఎంపీ సత్యవతి

ప్రజాశక్తి-దేవరాపల్లి: మండలంలోని ఎం. అలమండ గ్రామ సర్పంచ్, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాడి జగన్‌కుమారుడు దాడి ఉదయ్‌కుమార్ నీట్‌లో 610 మార్కులతో విజయం సాధించాడు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్‌ను అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీశెట్టి సత్యవతి అభినందించి, మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న వరలక్ష్మి

ప్రజాశక్తి -మునగపాక రూరల్: సమస్యల పరిష్కారానికి ఈనెల 31న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలో పెద్దఎత్తున మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జివరలక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్నం భోజన కార్మికులకు ఉపాధి భద్రత కరువైందన్నారు. అగ్ని ప్రమాదాలకు గురయ్యే ప్రమాదమున్నా వీరికి వైద్యబీమా సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అనేక పాఠశాలల్లో ప్రథమ చికిత్స సదుపాయం కూడా లేదన్నారు. భోజన పథకం అమలుకు పాఠశాలల్లో వంట షెడ్లు, వంటపాత్రలు, మంచినీరు, గ్యాస్ సరఫరా వంటి మౌలిక సౌకర్యాల కల్పనలో శ్రద్ధ కనబరచకపోవడం విచారకరమన్నారు. జగనన్న గోరుముద్ద పేరుతో ఇస్తున్న మెనూఛార్జీలకు సంబంధం లేకుండా, రోజుకో వంటతో ప్రభుత్వం మెనూ తయారుచేసి వర్కర్లపై భారాన్ని మోపిందన్నారు. భోజనకార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, వంటగ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం శ్రీదేవి, కుమారి, జగది, ఎస్ లక్ష్మి, వేగి భవాని పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ



భక్తి పుస్తకాలను అందజేస్తున్న వెంకటేశ్వర శర్మ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని పాచిలవానిపాలెంలో రామాలయానికి ఆర్‌వై అగ్రహారానికి చెందిన నేమాని వెంకటేశ్వరశర్మ దంపతులు ఆధ్యాత్మిక పుస్తకాలు ఆదివారం వితరణగా అందజేశారు. ప్రజల్లో భక్తిభావం పెంపొందించేందుకు భాగవతం , మహాభారతం, చైతన్య రామాయణం తదితర పుస్తకాలను తన సొంత నిధులతో కొనుగోలు చేసి అందించినట్లు తెలిపారు. విలువైన పుస్తకాలను అందించిన నేమాని దంపతులను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీబాబు, వైస్ ఎంపిపి రొంగళి సూర్యనారాయణ, ఎంపిటిసి రాజేష్, పిఏసిఎస్ చైర్మన్ ఆకుల శివ, వార్డు సభ్యులు చల్లా సురేష్, గండి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా అప్పలనాయుడు జన్మదిన వేడుకలు

అనాథ చిన్నారులకు స్వీట్లు ఇస్తున్న అప్పలనాయుడు

ప్రజాశక్తి - పరవాడ: టిడిపి రాష్ట్ర కార్యదర్శి, బండారు అప్పలనాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం మండలంలోని వెన్నెలపాలెంలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి యువనేతకు పూలమాలలు, పుష్పగుచ్చాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

యువనేత పుట్టినరోజును పురస్కరించుకుని పరవాడ మండలం భరణికం అనాథాశ్రమంలో వంద మంది పిల్లల సమక్షంలో టిడిపి నాయకులు రొంగలి గోపాలకృష్ణ, పైల చిన అక్కునాయుడు, చీపురుపల్లి శ్రీను, మేడిశెట్టి బాలాజీనాయుడు ఆధ్వర్యంలో అప్పలనాయుడు దంపతులను ఆహ్వానించి కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో పిల్లలకు నిత్యవసర సరుకులు, బుక్స్, పండ్లు, చాక్లెట్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి బొండా తాతారావు, దాట్ల గణేష్ రాజు, లోకిరెడ్డి అభినాయుడు, గొంప మారునాయుడు, బండారు వీరునాయుడు, బోజంకి నాయుడు, నాగేష్, కనకరాజు, పైల ప్రసాదు, అప్పారావు, పైలా నర్సింగరావు, సందీప్, గిరి, సన్నీ, సుధాకర్ పాల్గొన్నారు

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ఆంధ్రా జట్టు

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన ఆంధ్రా క్రీడాకారులు

ప్రజాశక్తి - పరవాడ: అండర్ వాటర్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే మూడవ నేషనల్ ఫిన్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు ఎంపిక ఆదివారం సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో జరిగింది. పోటీలను ప్రారంభించిన పాఠశాల సిఇఒ కె. నిశాంత్ మాట్లాడుతూ క్రీడలలో తమ విద్య సంస్థ పతకాలు సాధించడమే కాకుండా చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు ఉపయోగపడేలా క్రీడలు నిర్వహిస్తూ భరోసానిస్తోందన్నారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులను సంస్కృతి గ్లోబల్ స్కూల్ స్విమ్మింగ్ పూల్ ప్రాంగణంలో పతకాలతో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి, సిఇఒ నిశాంత్, యుఎస్ఎఫ్ఎ రాష్ట్ర కార్యదర్శి పి. బాలాజీ, డబ్ల్యుఎఫ్ఐఎ మంగమ్మ, స్పోర్ట్స్ డైరెక్టర్ మధు బాబ సత్కరించారు. పోటీలలో వివిధ విభాగాలలో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించిన వారిలో హిమప్రభాస్, అభినవ్, సోహాన్ గౌతమ్, అతిక్ష, కుమారి ప్రేరణ, మైత్రేయి, రుచి, తమ్మురు, విద్యుశ్రీ, పురందరి, కార్తీక్, వైభవ్, పూణీత్ వీర్, చేతన్ శివాశిష్, లలిత్ రాంచరణ్, బోనీ అశ్వద్, లాస్య అభినయ్, అతిక్ష, సోహాన్, ప్రేరణ, మైత్రి, కార్తీక్, సౌరి, పూణీత్ జైదీవ్, మణికంఠ, రణధీర్, తేజ, ధార్మిక, శ్రేయస్సు, ధరహాస్, సాయి లైకేష్, పి. కీర్తి, సంజనా, శ్రీమయ్ శ్యాగ్గణేష్, అజిత్ ఉన్నారు.

శ్మశానవాటికలో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామ శ్మశానవాటికలో స్వచ్ఛభారత్ పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ శరగడం భాగ్యలక్ష్మి బాపు నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. శ్మశానంలో పెరిగిన పిచ్చి మొక్కలను జెసిబి సహాయంతో తొలగించారు శ్మశానసహద్దులను వరకు శుభ్రపరిచారు పాఠశాల నుండి వాటర్ ట్యాంక్ వరకు సిమెంట్ రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని తొలగించారు.

వైసిపి మండల నూతన అధ్యక్షులకు అభినందన

వైసిపి నూతన అధ్యక్షులకు స్వీట్లు తినిపిస్తున్న మంత్రి అమర్

ప్రజాశక్తి-అనకాపల్లి/కశింకోట : అనకాపల్లి, కశింకోట మండలాల వైసిపి అధ్యక్షులు నియమితులైన పెద్దిశెట్టి గోవింద, మలసాల కిషోర్‌లను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అభినందించారు.ఆదివారం మింధిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో అమర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, తమకు పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించడంపై కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా అమర్ మాట్లాడుతూ, మండల, గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసి రానున్న ఎన్నికలలో పార్టీని విజయపథాన నడిపించేందుకు కృషి చేయాలని సూచించారు. పార్టీలో శ్రమించిన వారిని అధిష్టానం గుర్తిస్తుందన్నారు. కశింకోట మండల వైసిపి అధ్యక్షులు మలసాల కిషోర్ మాట్లాడుతూ పార్టీ గుర్తించి ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని, పార్టీ కార్యకర్తలను ఎన్నికలకు కార్యోన్ముఖులను చేస్తానన్నారు. జెడ్పిటిసి దంతులూరి శ్రీధర్‌రాజు, ఎంపిపిలు కలగా లక్ష్మీగున్నయ్య నాయుడు, గొర్లె సూరి బాబు, ఎంపిటిసిలు లగిశెట్టి గణేష్, అద్దంకి సతీష్, ఇందలి ముసలి నాయుడు, పసుపులేటి రామకృష్ణ, బొండా అప్పలరాజు, ఆడారి సూరప్పారావు, వియ్యపు భూలోక నాయుడు, హనుమంత వెంకట్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

రైతు సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

రైతులతో నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ప్రజాశక్తి -మునగపాక రూరల్: స్థానిక సంతబయలులో వినాయక కల్యాణమండపంలో ఆదివారం ములబందగోడి రైతు సంఘం నూతన కమిటీ ఏర్పాటైంది.కమిటీ అధ్యక్షులుగా బొడ్డేడ రామునాయుడు, కార్యదర్శిగా దాడి శివకృష్ణ, కోశాధికారిగా సూరిశెట్టి సంతోష్‌తోపాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సంఘాలు సంఘటితంగా ఉన్నప్పుడే హక్కులను సాధించుకోగలమన్నారు. నూతన కమిటీలో పదవి బాధ్యతలు అప్పగించిన స్థానిక మూల సంఘం రైతులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కమిటీతోపాటు డైరెక్టర్స్‌గా బొడ్డేడ రమణబాబు, కొయిలాడ సత్యనారాయణ, సూరిశెట్టి నాగ దుర్గునాయుడు, దొడ్డి శివ, యల్లపు పరదేశి నాయుడు, దాడి గణేష్, దాడి త్రినాథ్ నియామకమయ్యారు. ఎన్నికలు అధికారిగా దాడి సూర్యనారాయణ, సహాయకుడుగా దాడి త్రినాథ్ వ్యవహరించారు.

చికెన్ అమ్మకాలకు సరికొత్త ప్రచారం

కూరగాయల ధరలతో పోలుస్తూ బోర్డు పెట్టిన వ్యాపారి
సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన అంశం

చికెన్ దుకాణం వద్ద పెట్టిన కూరగాయల ధరల బోర్డు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో, ఓ చికెన్ వ్యాపారి చికెన్ వ్యాపారాన్ని ప్రమోట్ చేసుకుంటూ పెట్టిన బోర్డు వైరల్‌గా మారింది. కొంతకాలంగా టమోటా ధరలు విపరీతంగా పెరిగిపోవడం సామాన్యుడి సైతం కొనుగోలు చేసుకునే పరిస్థితి లేకపోవడంతో పలు రకాల సెటైర్లు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మండలంలోని బంగారుమెట్ట జంక్షన్ సమీపంలోని చికెన్ వ్యాపారి పెట్టిన బోర్డు హాట్‌టాపిక్‌గా గా మారింది. చికెన్ ధరలు గత కొద్దిరోజులుగా తగ్గుముఖం పట్టాయి. కిలో రూ.300పైగా ఉన్న చికెన్ ధర ప్రస్తుతం రూ.200 మాత్రమే ఉంది. దీంతో ఆ వ్యాపారి కూరగాయల కంటే చికెన్ రేటు తక్కువ అంటూ కూరగాయల ధరలు ప్రస్తావించాడు.టమోటా కిలో రూ.130, మిర్చి కిలో రూ.250, అల్లం కిలో రూ. 300, వంగ కిలో రూ.80, బెండ కిలో రూ.60, వీటన్నింటితో పోలిస్తే చికెన్ ధరలు తక్కువ సుమా అన్నట్లు చికెన్ షాప్ వద్ద బోర్డు పెట్టాడు. దీనిపై ఈ ప్రాంతంలో సోషల్‌మీడియాలో పెద్ద ప్రచారమే సాగుతోంది.

కారు ప్రమాదంలో బయటపడ్డ గంజాయి

ప్రజాశక్తి - అనంతగిరి : ఏజెన్సీ ప్రాంతం నుంచి మైదాన ప్రాంతానికి గుట్టు చప్పుడుగా తరలిస్తుండగా ప్రమాదం జరగడంతో గంజాయి ప్యాకెట్లు ఘాట్ రోడ్‌లో పట్టుబడ్డాయి. అనంతగిరి పోలీస్ స్టేషన్ సమీపం వైఎస్ఆర్ విగ్రహం మలుపు వద్ద ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో కారు, బైక్ ఢీ కొన్నాయి. ఈ ఘటనలో కారు ముందు భాగం నుంచి బయట పడ్డాయి. స్థానిక పోలీసులు రెండు వాహనాలు, గంజాయిను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కళాశాల అభివృద్ధికి సమిష్టి కృషి

ఎంఎంఎల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం నిర్ణయం

సమావేశమైన ఎంఎంఎల్ కాలేజీ పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి : కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంఎంఎల్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం తీర్మానించింది. ఆదివారం అనకాపల్లి జార్జి క్లబ్‌లో సంఘ అధ్యక్షులు బొడ్డేడ అప్పారావు అధ్యక్షతన జరిగిన పూర్వవిద్యార్థుల సంఘ సర్వసభ్య సమావేశంలోజార్జిక్లబ్ అధ్యక్షులు బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు, రాష్ట్ర విద్యార్థి జెఎసి నాయకుడు ఆడారి కిషోర్ కుమార్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ విల్లూరి పైడారావు, సీనియర్ న్యాయవాది సిహెచ్ రామచంద్రరావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కెవిఎస్ నాయుడు, సంఘ కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు, కోశాధికారి వై జగదీశ్వరరావు, ఉపాధ్యక్షులు కెఎస్ఎస్ శర్మ, సంయుక్త కార్యదర్శి కొణతాల రాజేంద్రప్రసాద్, కొణతాల రామచంద్రరావు, బివి కన్నారావు, జి పెంటాద్రి రావు, బాలు గాడి, బివి రాజు, శ్రీనివాసరావు, మోహన్ రావు, సోమరాజు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధికి అందజేయాల్సిన సహకారం, ఉద్యోగ ఉపాధి అవకాశాలున్న కొత్త కోర్సులను కళాశాలలో ప్రవేశపెట్టాలని యాజమాన్యాన్ని కోరనున్నట్టు తెలిపారు. కళాశాల, విద్యాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రతినెలా రెండో శనివారం పూర్వ విద్యార్థులంతా సమావేశం కావాలని నిర్ణయించారు. దేశ, విదేశాల్లో వివిధ హోదాల్లో ఉన్న సుమారు లక్ష మంది పూర్వ విద్యార్థుల వివరాలు సేకరించాలని, కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేయాలని నిర్ణయించారు. కళాశాలలో సోలార్ యూనిట్ ఏర్పాటు చేసి విద్యుదుత్పత్తి అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ / 1967 సేవలను వినియోగించుకోండి

మాట్లాడుతున్న కాండ్రేగుల వెంకటరమణ

ప్రజాశక్తి-అనకాపల్లి : వినియోగదారుల హక్కులు, ఆహార, పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖల సమస్యల పరిష్కారానికి ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నెంబర్ 1967 సేవలను సద్వినియోగం చేసుకోవాలని వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. ఆదివారం పబ్లిక్ ఫోరం కార్యాలయంలో జరిగిన వినియోగదారుల సంఘాల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ, బియ్యం కార్డు, గ్యాస్, పెట్రోల్ బంకులు, రైతు బజార్లు, తూనికలు కొలతల శాఖ, ఔషధ నియంత్రణ, హాల్ మార్కు, ఐఎస్ఐ వంటి వినియోగదారుల వ్యవహారాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్ దిక్సూచిగా నిలుస్తుందన్నారు. వినియోగదారుల హక్కుల రక్షణ, చైతన్యం తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్‌ను నెలకొల్పిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తక్షణం మండల వినియోగదారుల సమాచార కేంద్రాలు, విద్యా సంస్థల్లో కన్స్యూమర్ క్లబ్‌లు, వినియోగదారుల రక్షణ మండలిని జిల్లాలో ఏర్పాటు చేయాలని, వినియోగదారుల రక్షణ చట్టం-2019 ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని కాండ్రేగుల వెంకటరమణ డిమాండ్ చేశారు. సమావేశంలో కన్స్యూమర్ రైట్స్ సేఫ్‌గార్డింగ్ సొసైటీ అధ్యక్షుడు రెడ్డిసత్యనారాయణ, వినియోగదారుల సంక్షేమ సంఘం కార్యదర్శి టివి.రమణ (చోడవరం), వినియోగదారుల సంఘాల ప్రతినిధులు ఎస్.నూకరాజు (రాంబిల్లి), బి.జగ్గఅప్పారావు (మునగపాక) పాల్గొన్నారు.

మీనామృతంతో పంటల అధికోత్పత్తి

ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుపై రైతులకు అవగాహన

అనకాపల్లిలో మీనామృతం తయారీపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి -అనకాపల్లి : పంట ఎదుగుదల, చీడపీడల నివారణ ద్వారా అధిక ఉత్పత్తుల సాధనకు మీనామృతం ఎంతగానో ఉపయోగపడుతుందనిప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న, రీజనల్ కోఆర్డినేటర్ హేమసుందర్ అన్నారు. ఆదివారం మండలంలోని వెంకుపాలెం గ్రామంలో చేపల వ్యర్థాలు, బెల్లంతో మీనామృతం తయారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీనామతం తయారు చేయుటకు ఎక్కువ ఖర్చు అవసరం లేదని, కేవలం తయారు చేసుకోవచ్చని రైతులకు వివరించారు. డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ గోవింద్ మీనామతం వలన రైతులకు పంట ఉత్పత్తి ఖర్చులు తగ్గి మేలు జరుగుతుందన్నారు.కార్యక్రమంలో సుందరయ్య పేట, సీతానగరం, వెంకుపాలెం ఐసిఆర్‌పిలు, మండల ఇన్‌ఛార్జిలు, మోడల్ మేకర్స్, రైతులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం యూనిట్ నూతన గుంటపాలెం గ్రామంలో మీనామృతం తయారీ, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారుజ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి ద్వారపురెడ్డి రమణ,లక్ష్మీ ,శాంతి రైతులు పాల్గొన్నారు

మునగపాక రూరల్: మండలంలోని చూచుకొండ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంపై మండల ఇన్‌ఛార్జి పాతాళం సత్యనారాయణ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పదికిలోల చేప వ్యర్థాలు, పదికిలోల నల్లబెల్లం, తగినంత నీటిని ఒక డ్రమ్ములో ఆ మిశ్రమాన్ని 27 రోజులు మురగనిస్తే మీనామృతం తయారౌతుందన్నారు. దీన్ని పంటలపై పిచికారీ చేయడం ద్వారా చీడపీడలతో తెగుళ్లను సమర్థవంతంగా నివారించవచ్చని సూచించారు. కార్యక్రమంలో రైతులు సిహెచ్ నూకరత్నం, సూరిబాబు, సిహెచ్ పార్వతి, టి.సత్తిబాబు, సిహెచ్ గౌరి

'వాకర్స్' సభ్యులకు గుర్తింపు కార్డులు

సభ్యులకు గుర్తింపు కార్డులు ఇస్తున్న వాకర్స్ ప్రతినిధులు

ప్రజాశక్తి-అనకాపల్లి : నడకతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ కార్యదర్శి కె.ద్వారకానాథ్ తెలిపారు. ఆదివారం వాకర్ ఇంటర్నేషనల్ క్లబ్ పాలకవర్గం ఆధ్వర్యంలో సభ్యులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యంపై వాకర్స్ క్లబ్ సభ్యులు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ కోశాధికారి మద్దుల రాంజీ ఎవిపి డాక్టర్ డిడి నాయుడు, యల్లపు సాంబశివరావు(శివ), అధ్యక్షులు భీశెట్టి రామకష్ణ, కార్యదర్శి, రాపేటి నారాయణరావు, కోశాధికారికు ఎన్‌టిఆర్ వాకర్స్ క్లబ్, తుమ్మపాల వాకర్స్ క్లబ్, కశింకోట వాకర్స్ క్లబ్, అనకాపల్లి వాకర్స్ క్లబ్ సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేశారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

ఆర్థికసాయం అందిస్తున్న దాతలు

ప్రజాశక్తి-సబ్బవరం.: మండలంలోని వంగలి గ్రామంలో వీరాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి వైసిపి రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, అతని సోదరుడు మండల వైస్ ఎంపిపి-2 చొక్కాకుల గోవింద రూ.50వేల ఆర్థికసాయం అందించినట్లు ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షులు గవర రాజు తెలిపారు. కార్యక్రమంలో కోటీని అమ్మతల్లి నాయుడు, వేపాడ స్వామి నాయుడు, జెట్టి హేమంత్, కంద అప్పలస్వామి, జెట్టి స్వామినాయుడు, మెడపురెడ్డి జగన్నాథం, గొంప దేముడుబాబు పాల్గొన్నారు.

పరదేశమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న వైసిపి అధ్యక్షుడు శంకరరావు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : కొండకర్ల అందలాపల్లి గ్రామంలో పరదేశమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి ఆదివారం వైసిపి మండల శాఖ అధ్యక్షులు దేశంశెట్టి శంకరరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకుడు కోన బుజ్జి, కోట్ని శివ, గుడివాడ రమణ, నామాల జగదీష్ పాల్గొన్నారు.

వర్షానికి రైతుల ఎదురుచూపు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : వర్షం పడాలని రైతులు ఎదురుచూస్తున్నారు, రెండు వారాల క్రితం నారుమళ్లలో వరి విత్తనాలు చల్లినప్పటికీ, పది రోజులుగా ఎటువంటి వర్షాలు పడలేదు. నీరు లేక నాటిన వరి విత్తనాలు పాడైపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి నారుమళ్ల దశల్లోనే ఎండిపోతుండడంతో ఆవేదన చెందిన రైతులు కాలువలు ద్వారా సాగునీరు ప్రవహించినట్లయితే బాగుండేదని అంటున్నారు.. వాతావరణం అనుకూలించక ఇప్పటికే వరి నాట్లు వేయటం చాలా ఆలస్యమైందని,కొనసాగినట్లయితే వరి సాగు చేయడం కష్టమని రైతులు ఆవేదన చెందుతున్నారు.

లయన్స్ క్లబ్‌తో సేవా కార్యక్రమాలు

నూతన గవర్నర్ గోపాలరావు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: లయన్స్ క్లబ్ 43వ గవర్నర్‌గా డాక్టర్ అధికారి గోపాలరావు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ధర్మసాగరం వద్ద స్టార్ హెూమ్స్‌లో నవ్య లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ క్యాబినెట్ ఇనస్టాలేషన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. 6 జిల్లాల 500 మంది ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఎల్సిఐఎఫ్ సెక్రటరీ లైన్ వి.విజయ్ కుమార్ రాజు అధికారి గోపాలరావు, క్యాబినెట్ సభ్యులు 150 మందితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ, ఈ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్‌కు సంబంధించి విశాఖలో కోటి రూపాయల వ్యయంతో వచ్చే ఆరు నెలలో బ్లడ్ బ్యాంక్, డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేస్తామన్నారు. అక్షయ ఫౌండేషన్ కు ఫీడ్ ద యాంగర్ ప్రోగ్రాంకు రెండు వ్యాన్లు సమకూర్చి పేదవారికి ప్రతిరోజు 300 మందికి ఆహారం అందించేందుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. మన్యం జిల్లా పార్వతీపురంలో కోటి 20 లక్షలతో పాఠశాల భవన నిర్మాణానికి తోడ్పాటును అందించామని, పలాసలో కోటి రూపాయల వ్యయంతో ఐటిఐ హాస్టల్ భవన నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.శ్రీకాకుళం జిల్లాలో తిత్లి తుఫాన్ లో శిథిలావస్థకు చేరుకున్న మూడు పాఠశాల భవనాలను సుమారు కోటి రూపాయల వ్యయంతో పునర్నిర్మాణం చేపట్టామన్నారు. 2024 సంవత్సరంలో వెయ్యి మంది కి కంటి ఆపరేషన్లు చేయడానికి నిర్ణయించినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా లక్ష మొక్కలు నాటడానికి, 5 వేల యూనిట్లు బ్లడ్ సేకరించడానికి క్లబ్ నిర్ణయించినట్లు గవర్నర్ గోపాలరావు తెలిపారు. విశాఖపట్నంలో లైన్స్ క్యాన్సర్ హాస్పిటల్ అభివృద్ధి చేయడానికి నర్సీపట్నం, తుని, ప్రత్తిపాడులలో విజన్ సెంటర్ను బేస్ ఆసుపత్రిగా అభివృద్ధి చేయడానికి క్లబ్ తీర్మానం చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గత జిల్లా గవర్నర్ డి రాఘవేంద్రరావు, డివీఎస్ రాజు, డిఎస్ఎస్వి వర్మ, వి.ఉమామహేశ్వరరావు, కౌన్సిల్ చైర్మన్ వి రవీంద్రనాథ్

మాట్లాడుతున్న గోపాలరావు

ఎమ్మెల్సీ ఏ.సుధాకర్ రెడ్డి, కృష్ణంరాజు, బంగారు రాజు, చింతకాయల సన్యాసి పాత్రుడు, విప్పల ప్రసాదు, కృష్ణ ప్యాలెస్ బంగారం రాజు, బీవీ ప్రసాద్, కాళిదాసు, డాక్టర్ ఎక్కల రామకృష్ణ, రాయపు రెడ్డి శ్రీనివాస్, తారక రామారావు, ఆరు జిల్లాల ప్రతినిధులు, లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

స్వాగతం పలుకుతున్న మహిళలు

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ కు మున్సిపాలిటీ 13వ వార్డులో ఆత్మీయ స్వాగతం లభించింది. ఆదివారం మరిడిమాంబ కాలనీలో ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ప్రతి ఇంటి ముందు హారతులు, పూలమాలలు, పుష్ప గుచ్చాలు, శాలువాలతో వార్డు ప్రజలు స్వాగత, సత్కారాలు చేశారు. తమ కాలనీలో లో ఓల్టేజ్ సమస్యను తీర్చాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు నిర్మాణం చేపట్టేలని ఎమ్మెల్యేని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ సుబ్బలక్ష్మి, 13వ వార్డు కౌన్సిలర్, వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, వైస్ చైర్మన్ కోనేటి రామకష్ణ, శాలివాహన కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ అర్జున, ముస్లిం సంచార జాతుల స్టేట్ డైరెక్టర్ చోటి, మున్సిపల్ కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, కో ఆప్షన్ కౌన్సిలర్ షేక్ రోజా, వైసిపి మహిళ విభాగం టౌన్ అధ్యక్షురాలు గణమ్మ, కార్యదర్శి గంటా లలిత, వైసిపి నాయకులు కొణతాల వరలక్ష్మి, కనితి అన్నపూర్ణ, దనిమిరెడ్డి ప్రసాద్, టౌన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏకాశివ, దేవత అరుణ, యాదగిరి శేషు, మున్సిపల్ కమిషర్ కనాకరావు, టౌన్ ఎస్ ఐ ధనుంజయ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-యస్.రాయవరం: మండలంలో గుడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011-12 ఏడాదికి చెందిన పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు అప్పటి రోజులను గుర్తు చేసుకుని జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కొన్ని సంవత్సరాల తరువాత కలిసిన స్నేహితులు ఒకరిని ఒకరు పలకరించుకుని ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యా బుద్దులు నేర్పిన ఉపాధ్యాయులకు పుష్ప గుచ్చాలతో స్వాగతం పలికి వారిని సత్కరించారు.

మాట్లాడుతున్న పైలా ప్రసాదరావు

ఓటర్ల నమోదులో జాగ్రత్తగా ఉండాలి : పైలా

ప్రజాశక్తి-మాడుగుల: ఓటర్ల నమోదు కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు జాగ్రత్త వహించాలని ఆ పార్టీ నేత పైలా ప్రసాదరావు సూచించారు. ఆదివారం కే జే పురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవలసిన అవసరం వుందని అన్నారు. కొత్త ఓటు నమోదుతో పాటు, పాత వారు తమ చిరునామాలు మార్చుకోవచ్చున్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి వుండడం ఎంతో అవసరమన్నారు. కొత్త ఓట్ల నమోదు ప్రక్రియలో కార్యకర్తలు జాగ్రత్త వహించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాపేటి జోగి నాయుడు, దాడి రామ లక్ష్మణ, తనకాల శివ, యల్లపు రాము, సరగడం ఆదిబాబు, కాళ్ళ నరసింగరావు, గంగు నాయుడు, వేగి నారాయణ రావు, ఆదారి నారాయణరావు, మొల్లేటి గంగ అప్పారావు, మద్దాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన రోడ్డు పనులు

- పాలకుల చోద్యంతో ప్రజలకు ఇక్కట్లు

ప్రజాశక్తి-రోలుగుంట: ఆరేళ్ల క్రితం నిర్మాణం చేపట్టిన రహదారి పనులు పూర్తి కాలేదని నాలుగు పంచాయతీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొలుగొండ మండలం ఏటిగైరంపేట ఆర్అండ్‌బి నుండి ఎంకె.పట్నం, బిబి.పట్నం మీదుగా రత్నంపేట, ఒడ్డిప ఆర్అండ్‌బి రోడ్డు వరకు సుమారు ఐదు కిలో మీటర్ల రహదారి గోతుల మయంగా మారిందని, దీంతో నాలుగు గ్రామాలకు చెందిన ప్రజలు మండల కేంద్రమైన రోలుగుంట గ్రామానికి చేరాలంటే సుమారు 25కిలో మీటర్లు నర్సీపట్నం మీదుగా వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. అక్కడ నుండి తమ గ్రామాలకు చేరాలంటే ఆటోలు కూడా వచ్చేవి కాదని, 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వంలో జన్మభూమి కార్యక్రమంలో అధికారులను నిలదీసి శాంతియుతంగా నిరసన చేపట్టి అధికారులను మండల కేంద్రానికి వెళ్లనీయకుండా అడ్డుకున్నామన్నారు. ముందు రహదారికి నిధులు మంజూరు చేయాలని తహశీల్దార్, ఎంపిడిఒ, పంచాయతీరాజ్ ఏఇలను నిలదీసి పోరాటం చేయగా అప్పటి ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు నిధులు మంజూరు చేయించారు. గుత్తేదారుడు పనులు ప్రారంభించి ఆ రహదారి పనులు చేపట్టి ఒక పరుపు(ఒక లేయరు) వేశాడని,. దీనికి సంవత్సరం కాలం పట్టిందన్నారు. 2019లో ఎన్నికలు జరిగ్గా తదనంతరం వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ గెలవడంతో 2021లో నిధులు మంజూరు చేయించారు. గుత్తేదారుడు పనులు ప్రారంభించి రెండేళ్లు కావస్తోంది. గుత్తేదారుడు ఒక లేయరు రోడ్డు వేయడంతో పాటు కల్వర్టు నిర్మించాడు. బిటి రోడ్డునకు పిక్క, ఇసుక వేయించాడు. మళ్లీ అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. మళ్లీ కథ మొదటికే వచ్చింది. ఇప్పటికైనా ఈ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతున్నారు.

నిలిచిన రోడ్డు పనులు

సాగుదారులకు పథకాలు అందించాలి

ప్రజాశక్తి -కొత్తకోట: ఉర్లోవ రెవెన్యూ పరిధిలో దళిత, గిరిజనుల డి పట్టా భూములకు ప్రధానమంత్రి కిసాన్ నిధి వర్తింప చేయాలని, వెబ్ ల్యాండ్, అడంగల్ లో నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్య వర్గ సభ్యులు కె గోవిందరావు డిమాండ్ చేశారు. ఆదివారం రావికమతం మండలం కొమరి గ్రామంలో ఉర్లోలోవ రెవిన్యూ పరిధిలో సాగు దారుల సమావేశం సోలం లక్ష్మీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ, ఉర్లోవ రెవెన్యూ పరిధి వి.మాడుగుల మండల పరిధిలో ఉండగా కొమరి, బుడ్డి బంద మచ్చ పురం గ్రామాల్లో 300 ఎకరాలు 368 మంది సాగుదారులుగా ప్రభుత్వం 2013లో పట్టాలిచ్చిందన్నారు. పట్టా ఇచ్చిన భూములకు ప్రభుత్వం పథకాలు అందలేదన్నారు. వెబ్ ల్యాండ్ రికార్డులో అడంగల్ 13లో నమోదు కావడంతో పంట నష్ట పరిహారాలు, బ్యాంకు రుణాలు రాలేదన్నారు. జగనన్న భూ సర్వేలో నమోదు చేయలేదన్నారు. దీని ఫలితంగా ఇచ్చిన పట్టాలకు విలువ లేకుండా పోయిందని పేర్కొన్నారు. తక్షణమే వెబ్ ల్యాండ్ రికార్డులో సాగుదారులుగా నమోదు చేయాలని, ప్రధానమంత్రి కిసాన్ నిధి వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై మాడుగుల ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఆందోళన సిద్ధం కావాలని ఈ సమావేశంలో తీర్మానించారు.ఈ సమావేశంలో సోలం రాజు,. బురుగని రత్నం, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గోవిందరావు

కొనసాగిన రిలే దీక్ష

ప్రజాశక్తి-కోటవురట్ల: అణుకు గ్రామానికి రహదారి, పాఠశాల కల్పించాలని చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 17వ రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం దిగివచ్చి తమ న్యాయమైన కోర్కెలు తీర్చే వరకు నిరాహార దీక్ష విరమించేది లేదని గిరిజనులు తెలిపారు. తక్షణమే పాఠశాల, రోడ్డు మంజూరు చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డేవిడ్‌రాజు, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

స్కూటీని అందజేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

వికలాంగులకు స్కూటీల పంపిణీ

ప్రజాశక్తి-యస్.రాయవరం: మండలంలోని కొరుప్రోలు క్యాంపు కార్యాలయంలో ఆదివారం పాయకరావుపేట శాసనసభ్యులు గొల్ల బాబురావు చేతుల మీదుగా వికలాంగులకు ట్రై వీలర్ స్కూటీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలకు, వృద్ధులు, వికలాంగులకు అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం లబ్ది చేకూరిస్తుందని తెలిపారు. వికలాంగులు తమ రోజువారీ కార్యక్రమాలు చేసుకుంటూ ఒకరిపై ఆధారపడకుండా జీవనోపాధి పొందేందుకు ఈ ట్రై వీలర్ స్కూటీలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కాకర దేవి, కొరుప్రోలు ఎంపిటిసి వెంకట లక్ష్మీ, పార్టీ సీనియర్ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, కొణతాల శ్రీనివాస్, తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యన్నారాయణ, మాజీ సర్పంచ్ పుట్టా సుధాకర్, వికలాంగుల అభివృద్ధి సంస్థ ప్రతినిధులు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక రిషి డిగ్రీ కళాశాలలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, ఉన్నత భారత్ అభియాన్ సహకారంతో ఈ 24న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల కరస్పాండెంట్ కోన సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు సుమారు 9 కంపెనీలు ప్రతినిధులు వస్తున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్వ్యూలకి ఆసక్తి కలిగిన అభ్యర్థులంతా సోమవారం ఉదయం 8:30 గంటలకే కళాశాలకు చేరుకోవాలన్నారు.

మణిపూర్‌లో దారుణాలు అరికట్టాలి

-పలుచోట్ల శాంతి ర్యాలీలు, మానవహారాలు

అనకాపల్లిలో మానవహారం చేపట్టిన నేతలు

ప్రజాశక్తి- యంత్రాంగం

మణిపూర్ రాష్ట్రంలో హింసాత్మక ఘటనలను అరికట్టాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. అనకాపల్లి, విశాఖలో ర్యాలీలు, మానవహారాలు ఆదివారం చేపట్టారు.

అనకాపల్లి : మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక ఘటనలపై ప్రభుత్వాలు, ప్రజా సంఘాలు, మానవతావాదులు తక్షణమే స్పందించి శాంతిని నెలకొల్పేలా చర్యలు చేపట్టాలని అనకాపల్లి జిల్లా యునైటెడ్ ఫాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు కోరారు. ఆదివారం జిల్లాలో కసింకోట, మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి, పరవాడ, కోటపాడు, చోడవరం, తదితర మండలాలలో గల క్రైస్తవ సంఘాలతో కలిసి పట్టణంలోని శాంతి ర్యాలీ నిర్వహించారు. నెహ్రూ చౌక్ జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు సి.హెచ్.ప్రకాష్ మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవులు, సామాన్యులపై జరుగుతున్న దాడులు అమానుషమన్నారు. ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు ఎస్.క్రాంతి పాల్ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న దాడులతో నిరాశ్రయులైన వారికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు డాక్టర్.వినోద్ అబ్రహం, చైర్మన్.బి యోహాను, కెపిడి ఆర్ ప్రసాద్, కె.సన్నీ జేమ్స్, ఉపాధ్యక్షుడు. ఏ శ్యాంబాబు, కార్యదర్శి.బి ఏసురత్నం, ఉప కార్యదర్శి ఏసుదాసు, కోశాధికారి ఎం. రాజబాబు, ఉప కోశాధికారి బి .అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఆనందపురం : మణిపూర్ రాష్ట్రంలో మహిళలను నగ్నంగా ఊరేగించడానికి ఖండిస్తూ, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ వి.ఐ.ఎల సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన ఆనందపురం జంక్షన్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆనందపురం కూడలిలో మానవహారం నిర్వించారు. ఈ ప్రదర్శనకు వి.ఐ.ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి.హెచ్.రూపాదేవి, జిల్లా గౌరవాధ్యక్షులు పి.మణి హాజరై మాట్లాడారు. దేశంలో భారతమాతలకు రక్షణ లేదని మణిపూర్ ఘటన మరోసారి నిరూపించిందన్నారు. ఇలాంటి దుర్మార్గమైన సంఘటనలు వందల సంఖ్యలో జరిగాయని ముఖ్యమంత్రి ప్రకటించడం తీవ్ర వేదనని కలిగిస్తోందన్నారు. మణిపూర్ మహిళలకు సత్వర న్యాయం జరిగేటట్టు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనలో యూనియన్ నాయకులు అపర్ణ, కుంచమ్మ, శ్రీలక్ష్మి, పార్వతి, సంతోష్ కుమారి, శారద, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురంలో విఐఎల భారీ ర్యాలీ

కూర్మన్నపాలెం : మణిపూర్ రాష్ట్రంలో శాంతి నెలకొనాలని కోరుతూ హోలీ ఫ్యామిలీ చర్చి విచారణ కాపరి ఫాదర్ సరిసాప్రతాప్ ఆధ్వర్యాన వడ్లపూడిలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించింది. ప్లకార్డులు పట్టుకొని, నినాదాలుచేస్తూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఫాదర్ సరిసాప్రతాప్ మాట్లాడుతూ, మణిపూర్‌లో పేద, బలహీన, మైనార్టీ కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. లౌకిక రాజ్యమైన భారతదేశంలో భిన్నత్వంలో

వడ్లపూడిలో హోలీ ఫ్యామిలీ చర్చి ఆధ్వర్యాన ర్యాలీ..

ఏకత్వాన్ని పాటిస్తూ సమ భావముతో అందరూ నడుచుకోవాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన లౌకిక సిద్ధాంతాలు పాటిస్తూ, నైతిక విలువలతో ముందుకు సాగాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, సలహా మండలి యువతీయువకులు, విన్సెంట్ డి పాల్, మహిళా సంఘం సభ్యులు, దళ సభ్యులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : మణిపూర్ అమానుష ఘటనను ఖండిస్తూ సిఐటియు, ఐద్వా ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌టిసి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు తులసీరామ్, ఐద్వా మద్దిలపాలెం జోన్ కార్యదర్శి కె.కుమారి మాట్లాడారు. అలాగే దక్షిణ నియోజకవర్గంలోని జ్ఞానాపురం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద పిఒడబ్ల్యు, ఐఎఫ్‌టియు, ఎంఎస్ఎన్ఎస్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. మణిపూర్ సిఎం తక్షణమే రాజీనామా చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కె.నిర్మల, ఎస్.వెంకటలక్ష్మి, ఇందిర, ఇ.లక్ష్మి పాల్గొన్నారు. దళిత హక్కుల సమాఖ్య ఆధ్వర్యంలో ఎల్ఐసి అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటరమణ, దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ, ప్రతినిధి బంకపల్లి అప్పారావు, భీమ్ సేన వార్ నాయకులు దుర్గారావు, గుడివాడ అప్పారావు, రవికుమార్, వై.బాలకృష్ణ, న్యాయవాది బీర రత్నకుమారి, భారత నాస్తిక సమాజం జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు, ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రత్నం, సబ్బవరం అప్పారావు, బి.అప్పారావు, భీమారావు గురవయ్య పాల్గొన్నారు.

జివిఎంసి వద్ద ఐద్వా, సిఐటియు నేతల నిరసన

మారణహోమం నియంత్రణలో విఫలం

ప్రజాశక్తి -నక్కపల్లి:మణిపూర్ రాష్ట్రంలో గత 3 నెలలుగా జరుగుతున్న దారుణాలు, హత్యాచారాలు, మారణహోమాన్ని అరికట్టాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్రావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. మండలంలో రాజయ్యపేటలో ఆదివారం సీపీఎం కార్యకర్తలు, సానుభూతి పరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ, గత 3 నెలలుగా మణిపూర్ రాష్ట్రంలో ఆధిపత్యం కలిగిన మెయితీస్ తెగ వారు అణగారిన కుకీ, నాగాలు గిరిజన తెగ పై తెగబడి వారి ఆస్తులు, పంటలు ధ్వంసం చేసి, మహిళలను వివస్త్రను చేసి బహిరంగంగా ఊరేగించి సామూహిక అత్యాచారం చేయడం బాధాకరమన్నారు. రోజు రోజుకూ అనేక దారుణమైన సంఘటనలు బయట పడుతున్నా యన్నారు. ఈ మారణ కాండ 3 నెలలుగా జరుగుతున్నా బిజెపి ప్రభుత్వం అరికట్టకుండా, బాధితులకు రక్షణ కల్పించకుండా చోద్యం చూస్తుందని మండిపడ్డారు. ఇదంతా మతోన్మాదుల పథకం ప్రకారం దాడి చేసి మణిపూర్ రాష్ట్రంలో పర్వత ప్రాంతాల్లో ఉన్న కుకీ, నాగాలైన గిరిజనులను వెళ్ళగొట్టి ఆ ప్రాంతంలో ఉన్న గనులు, భూములపై ఆధిపత్యం సంపాదించడానికి ఈ కుట్ర పన్ని అమాయకులను బలి చేస్తున్నారన్నారు. ఇటువంటి సంఘటనలను దేశ ప్రజలందరూ ఖండించాలని, బాధితులకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. నిందితులను కఠినంగా శిక్షించే విధంగా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, నాయకులు ఎం.మహేష్ బాబు, పి.రమణ, ఎం.భయ్యన్న, జి.సోమేశ్వరరావు, సి.హెచ్.సోమేష్, కె.కాశీ, కె.భూలోక, ఎం.జాన్, ఎం.ధర్మరాజు, ఎం.బాపూజీ, కె.కాశీరావు, కె.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శంకరరావు, అప్పలరాజు

ఆటో డ్రైవర్‌పై పోలీసుల జులుం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ :నాతవరం మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవరు కలగాని నానిబాబు పై పోలీసులు జులుం ప్రదర్శించారు. కానిస్టేబుల్ మల్లేష్ చేయి చేసుకుని, తీవ్రంగా కొట్టాడంటూ బాధితుడి కుటుంబ సభ్యులు మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు పోలీసు స్టేషను ఎదుట శనివారం రాత్రి ఆందోళనకు దిగారు. ఆటో డ్రైవరును కొట్టడంతో అపస్మారక స్థితికి చేరాడని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. దీంతో హుటాహుటి నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి విశాఖ తరలించడం జరిగిందని తెలిపారు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం స్థానిక గొల్లపేటలో కానిస్టేబుల్ మల్లేష్ నివాసం ఉంటున్నారు. ఓ విషయమై మాట్లాడాలని స్టేషన్‌కు రావాలని ఆటోడ్రైవర్ కలగాని నానిబాబుకు కానిస్టేబుల్ ఫోన్ చేశారు. దీంతో ఆటోడ్రైవర్ స్టేషన్‌కు వెళ్లాడు.తన భార్యతో ఫోనులో ఎందుకు మాట్లాడుతున్నావంటూ కానిస్టేబుల్, పోలీసులు నానిబాబును తీవ్రంగా కొట్టారని బాధితుడి కుటుంబ సభ్యులు వెల్లడించారు. దెబ్బలు తాళలేక నానిబాబు మేడపై నుంచి కిందకు దూకాడన్నారు. కానిస్టేబుల్ పై చర్యలు తీసుకోవాలంటూ రాత్రి 10 గంటల వరకు స్టేషన్ ఎదుట ఆందోళన కొనసాగించారు. మాజీ సర్పంచి శెట్టి శ్రీను, మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు, వైసిపి నాయకులు పోతురాజు అక్కడకు చేరుకుని ఆందోళనకారులకు మద్దతు పలికారు.

ఈ విషయమై ఎస్సై లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, ఆటోడ్రైవరు నానిబాబును కానిస్టేబుల్ కొట్టిన విషయం తనకు తెలియదని పేర్కొన్నారు. దీనిపై ఆదివారం జిల్లా ఎస్పీ నాతవరం చేరుకుని విచారణ చేపట్టారు.

స్పృహ కోల్పోయిన ఆటో డ్రైవర్

మాట్లాడుతున్న ఆర్‌పి పట్నాయక్

ఆధునిక టెక్నాలజీతో దంత వైద్యశాల

- సినీ సంగీత దర్శకుడు ఆర్‌పి పట్నాయక్

ప్రజాశక్తి-కలెక్టరేట్: ఆధునిక టెక్నాలజీతో దంత వైద్యశాలను విశాఖ వాసులకు అందుబాటులోకి తీసుకురావడం అభినందించదగ్గ విషయమని సినీ సంగీత దర్శకులు ఆర్.పి పట్నాయక్ కొనియాడారు. ద్వారకానగర్ 3వ లైన్ లో నూతనంగా ఏర్పాటు చేసిన స్మైల్ ఎక్స్ ఎల్ దంత వైద్యశాలను ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్, బెంగళూరు తరహాలో ఇంట్రా ఓరల్ స్కానర్, ఫుల్ మౌత్ ఎక్స్ రే, ఓపిజి తదితర సౌకర్యాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు. గత ఐదేళ్లగా డాక్టర్ ఎర్లాస్ డైమండ్ డెంటల్ దంత వైద్యశాల వైద్య చికిత్సలు అందిస్తూ, ఆ అనుభవంతో స్మైల్ ఎక్సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దంత వైద్యులు డాక్టర్ ఈర్ల సంతోష్ కుమార్ మాట్లాడుతూ, ఆధునిక సౌకర్యాలతో అన్ని రకాల దంత చికిత్సలు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. వర్ధమాన హీరోయిన్ అర్చన, బిజెపి ఎంపి జివిఎల్ నరసింహారావు, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, పి.గణబాబు, కరణం ధర్మశ్రీ, తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్, పి.రఘువర్మ, మాజీ ఎమ్మెల్యేలు పి.విష్ణుకుమార్‌రాజు, పల్లా శ్రీనివాసరావు, తైనాల విజయ్ కుమార్, తిప్పల గురుమూర్తి రెడ్డి, ఎస్.కె రెహమాన్, కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, మాజీ మంత్రులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణ మూర్తి, విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు,చొక్కాకుల వెంకటరావు, చొక్కాకుల లక్ష్మి, జనసేన నాయకుడు పరుచూరి భాస్కరరావు, వైసిపి నాయకుడు బొడ్డేటి కాశీ విశ్వనాథ్ తదితర ప్రముఖులు దంత వైద్యశాల ప్రారంభోత్సవానికి విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దంత వైద్యులు బండారు శ్రీ సాయి, అనురాధ పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత స్థాయి గౌరవం

ఎంపి సత్యవతి

ప్రజాశక్తి- కలెక్టరేట్:ఏ రంగంలోనైనా ప్రతిభకు ప్రోత్సాహం అవసరమని, అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. ఆదివారం కేంద్ర గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆశీర్వాద్ కళ్యాణ మండపంలో గవర విద్యార్థినీ విద్యార్థులకు ఉత్తమ పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, ఏ రంగంలో ఉన్నా, విద్య అనేది ఉన్నత స్థాయి గౌరవాన్ని ఇస్తుందన్నారు.కేంద్ర గౌరీ సంఘం అధ్యక్షులు బుద్ద శివాజీ, ప్రధాన కార్యదర్శి ఆడారి లచ్చి అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా ఉత్తమ విద్యార్థులకు సర్టిఫికెట్‌తో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే పెతకంశెట్టి గణ వెంకటరెడ్డినాయుడు మాట్లాడుతూ, ప్రపంచంతో పోటీ పడుతున్న నేటి సమాజంలో విద్యకు ప్రధాన ప్రాధాన్యత అవసరమన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు మరింత ర్యాంకులు తెచ్చుకునేందుకు దోహదపడతాయన్నారు. గౌరీ సేవా సంఘం అధ్యక్షులు బుద్ద శివాజీ మాట్లాడుతూ, విద్య ద్వారా అభివృద్ధి చెందాలని, పిల్లల్ని ప్రోత్సహించాలని ప్రతి సంవత్సరం 500 మంది పిల్లలకు ప్రతి ఒక్కరికీ బహుమతులు ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. అనంతరం బి.ఎం. నాయుడు రాసిన పుస్తకాన్ని అతిథులు చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ బుద్ద చంద్రశేఖర్, డాక్టర్ మురళి సంతోష్ బుద్ద, ఆడారి పూరి జగన్నాథం మాస్టర్, కాళ్ల రాధికకోశాధికారి కొణతాల విజె శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు వేగి సత్యనారాయణ పాల్గొన్నారు.



పురస్కారాన్ని అందజేస్తున్న ఎంపి సత్యవతి

'మహిళలపై వైసిపి వివక్ష'

ప్రజాశక్తి- కలెక్టరేట్:వైసిపి ప్రభుత్వం మహిళల పట్ల వివక్ష చూపిస్తున్నందుకు నిరసన తెలియజేస్తే, వైసిపి మహిళా నేతలే మహిళలను హేళన చేసి మాట్లాడిన చర్యను ఖండిస్తూ ఆదివారం టిడిపి కార్యాలయం వద్ద జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి సారధ్యంలో నిరసన తెలియజేశారు. వైసిపి నేతల మాస్క్ లతో మెడలో మద్యం సీసాలు కొబ్బరి చిప్పలు వేసి సన్మానించి నిరసన తెలియజేశారు. .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలకు ఆస్తి హక్కు ఇచ్చింది, డ్వాక్రా మహిళలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది టిడిపియే అని అటువంటి పార్టీని డర్టీ పార్టీ గా పేర్కొనడం ఎంతవరకు సమంజసమన్నారు. అంబటి, అవంతి, గోరంట్ల వంటి కామాంధులు, బూతులు మాట్లాడే కొడాలి నాని, అనిల్ యాదవ్, పేర్ని నాని, వల్లభనేని వంశీలు ఉన్న డర్టీ పార్టీ వైసిపి అని ఆరోపించారు. దళిత నేత వంగలపూడి అనితను విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. తల్లిని షర్మిల సాక్షిగా వెళ్లగొట్టారని, ఎవరైనా పార్టీ అభివృద్ధికి షర్మిల పెడతారని కానీ జగన్ రెడ్డి తల్లిని పార్టీ నుండి బయటికి పంపడానికి షర్మిల పెట్టారని హెద్దేవా చేశారు. జగన్ తన చెల్లిని తరిమేశారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, తెలుగు మహిళ నాయకులు రామలక్ష్మి ప్రమీలారావు, బి.రమాదేవి, వేణుకుమారి, పి.సునీత, రాంబాయి, ఉమ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.